



పిఠాపురంలో సంస్థాన సత్రం

మన్నించు.. మహారాజా!

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

దూరప్రాంతాల నుంచి వచ్చేవారు ఎవరూ ఆకలితో బాధపడకూడదు అనే లక్ష్యంతోపాటు విద్యాభివృద్ధికి నిరంతరం కృషిచేయాలనే మహోన్నత లక్ష్యంతో పిఠాపురంమహారాజా కోట్లాది రూపాయిల విలువైన భూములు దానం చేశారు. వీటిని కౌలుకు ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయంతో కార్యక్రమాలు చేపట్టాల్సిన దేవదాయశాఖ అధికారులు మహారాజా ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడునెలలు గడిచినా ఇప్పటివరకూ వారికి మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించలేదు.

- డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థులకు అందని మధ్యాహ్న భోజనం
- మహారాజా ఆశయానికి తూట్లు
- కళాశాలలు తెరిచి ఇప్పటికే మూడు నెలలు

పిఠాపురం పట్టణానికి వివిధ పనులు, విద్యకోసం కళాశాలలకు వచ్చే విద్యార్థులకు నిరంతరం భోజనం అందించాలనే సదాశయంతో పిఠాపురం మహారాజా పట్టణంలో శ్రీసంస్థాన సత్రాన్ని ఏర్పాటుచేశారు. ఇందుకోసం తొండంగి మండలంలో 511 ఎకరాల వ్యవసాయ భూమిని దానం చేశారు. కాలక్రమంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం, విద్యాభివృద్ధికి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పిఠాపురం మహారాజా ఆశయాన్ని కొనసాగించాలని దేవదాయశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ భూముల ద్వారా ఏటా సగటున రూ.32-35లక్షల ఆదాయం వస్తోంది.

తొలుత ఇంటర్ విద్యార్థులకు..

సంస్థానసత్రం ద్వారా తొలుత పిఠాపురంలోని ఆర్ఆర్‌బీబీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేవారు. ఇతర ప్రాంతాలనుంచి ఇక్కడ చదువుకునేందుకు వచ్చేవారికి ఉచితంగా ఈ సదుపాయాన్ని కల్పించారు. గతేడాది నుంచి ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వమే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుండడంతో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు దీన్ని వర్తింపచేశారు. ఏటా జూలై, ఆగస్టు నెలల్లోనే భోజన కార్యక్రమాన్ని ప్రారంభించేవారు. అదే సమయంలో విద్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 2015-19 మధ్య కాలంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ ఉన్నతపాఠశాలల విద్యార్థులకు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు ఉచితంగా కోచింగ్ ఇవ్వడం ద్వారా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పేద, మధ్యతరగతికి విద్యార్థులకు ర్యాంకులు లభించాయి.

కారణం ఏమిటి

సంస్థానసత్రానికిచెందిన భూముల వేలం విషయంలో దేవదాయశాఖ అధికారులు వ్యవహరించిన తీరుతో తీవ్ర జాప్యం జరిగింది. విచిత్రమైన కారణాలతో ఐదుసార్లు వేలాన్ని వాయిదా వేశారు. వేలం సమయంలో ఈవో బదిలీ జరిగింది. అప్పటికే మధ్యాహ్న భోజనాలప్రక్రియ ప్రారంభించాల్సి ఉండగా అప్పటి ఈవో ఆ విషయాన్ని విస్మరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఈవోకు చార్జి అప్పగించడంలో ఆలస్యం చేయడం, దేవదాయశాఖ అధికారులు విద్యార్థులకు అందించాల్సిన భోజనాలపై దృష్టిపెట్టకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు హడావుడిగా టెండర్లు పిలిచారు. వీటిని ఖరారు చేసిన తర్వాతే భోజనాలు ప్రారంభించాలి.

ఈ ఏడాది అంతా జాప్యమే

విద్యాసంవత్సరం ప్రారంభమై కళాశాలలు తెరిచిన ఒకటి, రెండు వారాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం ప్రారంభించాలి. ఈ ఏడాది మూడునెలలు దాటినా ఇప్పటివరకూ ప్రారంభం కాలేదు. ఇప్పటికే పిఠాపురంలోని ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు తమకు మధ్యాహ్న భోజనం అందించాలంటూ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో పిఠాపురంతోపాటు తుని, ప్రత్తిపాడు, కాకినాడ రూరల్, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. దీంతో వీరు ఇంటినుంచే భోజనం తెచ్చుకోవడం.. లేకుంటే హోటళ్లకు వెళ్లి చేయాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆశయాలు అటకెక్కించారు

ఏ లక్ష్యం, ఆశయంతో పిఠాపురం మహారాజా సంస్థానసత్రాన్ని ఏర్పాటు చేశారో దానికి విరుద్ధంగా దేవదాయశాఖాధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. పదేళ్ల క్రితమే తొండంగిలోని భూములకు వేలం ద్వారా రూ.40-45లక్షల ఆదాయం రాగా ఇప్పుడు అది రూ.35లక్షలలోపునకే పరిమితం కావడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఆదాయం పెరగాల్సి ఉండగా తగ్గడం గమనార్హం. విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించడంలోనూ తీవ్ర జాప్యం చేయడం విమర్శలకు గురవుతోంది. పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షలకు ఉచిత కోచింగ్ తరగతులను అటకెక్కించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ వ్యవహారాలపై దృష్టిసారించి విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి స్వస్థనారి - శక్తివంతమైన కుటుంబం అభియాన్

- జిల్లావ్యాప్తంగా 537 ప్రత్యేక ఆరోగ్యశిబిరాలు

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కోసం, ఆరోగ్య సహిత స్త్రీ శక్తిని పెంపొందించేందుకు కేంద్రఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్వస్థనారి-శక్తివంతమైన కుటుంబం అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నుంచి అక్టోబరు 2 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తామని, ఈ కార్యక్రమ పర్యవేక్షణకు విజయవాడ నుంచి నోడల్ ఆఫీసర్ ఎన్‌యుహెచ్ఎన్ శేషారెడ్డి, చైల్డ్ హెల్త్ మోనిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్, న్యూరో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కార్తిక్ వచ్చినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. రాష్ట్రస్థాయి బృందం యూపీహెచ్‌సీలను, పీహెచ్‌సీలను మంగళవారం పరిశీలించింది. జిల్లా ఆస్పత్రి, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో మొత్తం 537 ప్రత్యేక ఆరోగ్యశిబిరాలు నిర్వహిస్తామని, బుధవారం 44 ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు జరుగుతాయని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ శిబిరాల్లో మహిళలు, పిల్లలకు విస్తృత వైద్యసేవలు అందిస్తామన్నారు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్లు అనగా(రొమ్ము, గర్భాశయ, నోరు), క్షయ, అనీమియా, సికిల్‌సెల్ వ్యాధి స్క్రీనింగ్, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, పోషణ సలహాలు, టీకాలు, రక్తదానం కార్యక్రమాలు, పోషకాహార అవగాహన, పీఎం-జెఅండ్ ఆబాకార్డ్ నమోదు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ



యూపీహెచ్‌సీని పరిశీలిస్తున్న రాష్ట్రస్థాయి అధికారులు

ఎంపానెల్డ్ ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ), (ఫాగ్‌సీ) వైద్యులు సైతం భాగస్వాములు అవుతారన్నారు. ఈ అభియాన్‌కు ఎన్‌సీడీ-ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.అరుణను నోడల్ ఆఫీసర్‌గా నియమించినట్లు వెల్లడించారు.

పెండింగ్ పరిష్కరించండి



రెండోరోజు కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు, హాజరైన కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్

- కలెక్టర్ల సదస్సులో పలు కీలక సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లిన కలెక్టర్
- జయలక్ష్మి సొసైటీ బాధితులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని వినతి
- పిఠాపురం అభివృద్ధికి రూ.100కోట్ల పెండింగ్ నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి
- రూ.175కోట్లతో ఉప్పుటేరు వంతెన డీపీఆర్ తయారీకి ఆదేశించాలని వినతి
- ఉప్పాడ కోత నివారణకు రూ.323కోట్ల విడుదల చివరి దశలో ఉందన్న కలెక్టర్
- ఏలేరు ఆధునికీకరణకు రూ.844కోట్లు పాలనా అనుమతులు రావాలని వివరణ
- జీజీహెచ్ ఆధునికీకరణకు రూ.500కోట్లకు అడ్మినిస్ట్రేటివ్ మంజూరుకు వినతి
- నిధులు రావాల్సిన పనులన్నింటినీ సీఎంవో కార్యాలయానికీ తెలిపిన కలెక్టర్
- కలెక్టర్, ఎస్పీలు ఫిట్‌నెస్‌పై దృష్టిసారించాలన్న సీఎం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పలు కీలక సమస్యలు, చేపట్టాల్సిన పెండింగ్ పనుల ప్రతిపాదనలను సీఎం చంద్రబాబు దృష్టికి కలెక్టర్ షాన్‌మోహన్ తీసుకువెళ్లారు. కలెక్టర్ల సదస్సు రెండోరోజైన మంగళవారం ఆయన సీఎంతో మాట్లాడారు. పలు కీలకమైన పనులకు తక్షణం నిధులు మంజూరు కావాల్సి ఉందని వివరించారు. ఇవి ఏయే దశల్లో పరిపాలన అనుమతుల కోసం నిరీక్షిస్తున్నాయో ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అదే సమయంలో వీటిని సీఎం ఆదేశాలతో ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులవద్ద ప్రస్తావించారు.

జయలక్ష్మి సొసైటీ స్కాంకు సంబంధించి బాధితులకు న్యాయం జరగడంలో ఆలస్యం అవుతుందని వివరించారు. సొసైటీ ఆస్తులను ఇప్పటికే సీఐడీ స్వాధీనం చేసుకుందని, వీటిని వేలం వేసి చిన్న డిపాజిటర్లకు చెల్లింపులు చేయాలని సీఎంతోపాటు సీఎం కార్యాలయ అధికారులకు వివరించారు. జయలక్ష్మి సొసైటీ బ్యాంకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.520కోట్ల మేర డిపాజిటర్లను మోసం చేసింది. దీంతో సీఐడీ రూ.450కోట్ల విలువైన ఆస్తులను సీజ్‌చేసింది. వీటిలో కొన్ని ఆస్తుల వేలం ద్వారా రూ.లక్ష లోపు డిపాజిట్‌దారులు 13,249మందికి రూ.32.72 కోట్లు చెల్లించాలని కలెక్టర్ వివరించారు.

పిఠాపురానికి రూ.100కోట్లు ఇవ్వండి

పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే పాడా ప్రకటించారని, దీని పరిధిలో అనేక అభివృద్ధి పనులు ఇప్పటికే చేపట్టామని కలెక్టర్ వివరించారు. ఈ పనులకు సంబంధించి రూ.100 కోట్ల వరకు పాతబిల్లులు పేరుకుపోయాయని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. ఆర్థికశాఖ వద్ద బిల్లులు ఆగిపోయాయని, తక్షణం మంజూరయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఏలేరు ఆధునికీకరణకు రూ.844కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి గతంలో ప్రభుత్వానికి పంపించామని వివరించారు. దీనికి పరిపాలన ఆమోదం కోసం నిరీక్షిస్తున్నామన్నారు. వీటికి వేగంగా నిధులు విడుదల చేయాలని కోరారు. వర్షాలు, వరద వచ్చినప్పుడు ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో వేలాది ఎకరాలు నీటమునిగిపోతున్నాయి. గతేడాది ఏలేరువరదలతో 9 మండలాల్లో కాలువలకు 60చోట్ల గండ్లుపడ్డాయి. కేవలం పదివేల క్యూసెక్కుల వరదను మాత్రమే తట్టుకోగలిగే సామర్థ్యం ఉన్న కాలువల్లోకి 47 వేల క్యూసెక్కుల వరద వచ్చిపడడంతో ఆ మండలాలు నష్టపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం ఏలేరు ఫేజ్1 పూర్తికి రూ.142కోట్లు, ఫేజ్2 పూర్తికి రూ.150కోట్లు ఇస్తానని మోసగించింది. ఈ లోపు సవరించిన అంచనాలు రూ.844కోట్లకు చేరాయి. గతేడాది సీఎం చంద్రబాబు ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు నిధులు ఇస్తామని హామీఇచ్చిన నేపథ్యంలో నిధులుమంజూరు చేయాలని సీఎం కార్యాలయ అధికారులను కోరారు.

ఉప్పుటేరుకు డీపీఆర్ ఆదేశాలివ్వండి

కాకినాడ కార్పొరేషన్ పరిధిలో ఉప్పుటేరుపై బ్రిడ్జి నిర్మించాల్సి ఉందని కలెక్టర్ సీఎంకు వివరించారు. కాకినాడ పోర్టుకు కరప మండలం గురజనాపల్లినుంచి వంతెననిర్మాణానికి రూ.175 కోట్లు ఖర్చవుతుందన్నారు. దీని నిర్మాణానికి వీలుగా జాతీయ రహదారుల సంస్థ ద్వారా డీపీఆర్ తయారీ చేపట్టాల్సిఉందని, ఈ మేరకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఏడేళ్ల కిందట శంకుస్థాపన చేసిన ఈ మూడో వంతెన నిర్మాణంపై ఇప్పటికీ కలగానే మిగిలిందన్నారు. కాకినాడలో వాహనాల రద్దీ తగ్గించేందుకు పాత పోర్టు రైల్వేస్టేషన్‌నుంచి ఏటిమొగ మీదుగా యానాం రోడ్డుకు కలిసేలా ఉప్పుటేరుపై గత టీడీపీ ప్రభుత్వంలో రూ.146 కోట్లతో 2018లో శంకుస్థాపన చేసినా ఆగిపోయిందని, ఇది వేగంగా ముందుకు కదిలేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. కాకినాడ జీజీహెచ్ శిథిలావస్థకు చేరుకుందని, దీని ఆధునికీకరణకు రూ.500కోట్లు నిధులు మంజూరు చేయాలని గత కలెక్టర్ల సదస్సులోను, పెద్దాపురం పర్యటనకు సీఎం వచ్చినప్పుడు దృష్టికి తీసుకువెళ్లినట్లు కలెక్టర్ సీఎం కార్యాలయ అధికారులకు వివరించారు. ఈ ప్రతిపాదనలకు సంబంధించి నిధుల విడుదలకు పరిపాలన ఆమోదం రావాల్సి ఉందని, ఈ మేరకు ఆర్థికశాఖకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సీఎం చంద్రబాబు ప్రసంగిస్తూ పోలీస్‌స్టేషన్లలోను, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లోను పరిశుభ్రత పక్కాగా ఉండేలా చూడాలని ఆదేశాలిచ్చారు. కలెక్టర్, ఎస్పీ సైతం ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు. వీరిద్దరూ ఆరోగ్యంగా ఉంటేనే జిల్లాకు మంచి పనితీరుకు సంబంధించి అవుట్‌పుట్ వస్తుందన్నారు.

చివరి దశ అనుమతుల కోసం నిరీక్షణ

ఉప్పాడ వద్ద సముద్రపు కోత తీవ్రంగా ఉందని కలెక్టర్ సీఎంకు వివరించారు. కోత నివారణకు కేంద్రం నుంచి నిధులు రాబట్టేలా చేసిన ప్రయత్నాలు విజయవంతం అయ్యాయని తెలిపారు. రూ.323కోట్లు నిధులు ఇవ్వడానికి నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సుముఖత తెలిపిందని, చివరి దశ అనుమతులు రావాల్సి ఉందని వివరించారు. ఇప్పటి వరకు సముద్రంలో 1,360 ఎకరాలు కలిసిపోయాయని తెలిపారు. నిధులు మంజూరైతే కోత నివారణకు ప్రత్యేక కాంక్రీట్ గోడతోపాటు 12 కిలోమీటర్ల మేర కోత నివారణ ప్రణాళిక అమలు చేయాల్సి ఉందన్నారు.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలి: జేసీ



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ ప్రక్రియలో కీలక పాత్ర పోషించే ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలని జేసీ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన వ్యవసాయం, పౌరసరఫరాలు, సహకార, ఏపీఈపీడీసీఎల్, లీగల్ మెట్రాలజీ, ట్రాన్స్‌పోర్టు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్‌సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో ఈ-క్రాప్ వివరాలు అత్యంత కీలకమైన నేపథ్యంలో ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలన్నారు. రైతులు పండించిన పంట రకం, సాగు విస్తీర్ణం వివరాలను క్షేత్రస్థాయి సిబ్బంది సక్రమంగా నమోదు చేసేలా చూడాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 60శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని, మిగిలిన రైతుల వివరాలను కూడా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని అన్నారు. ధాన్యం సేకరణ కేంద్రంలో పనిచేసే సిబ్బంది నియామకం, శిక్షణ కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం చేయాలన్నారు. ధాన్యం సేకరణకు అనుగుణంగా అవసరమైన గోనెసంచులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. రైతు సేవా కేంద్రాలకు రైస్ మిల్లుల అనుసంధానం చేసే ప్రక్రియ చేపట్టి తనిఖీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ దేవుల నాయక్, జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి సత్యనారాయణ రాజు, డీసీవో శ్రీనివాసురెడ్డి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



- జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఏపీటీఎఫ్ వినతి

కాకినాడలో జిల్లా జేసీ రాహుల్‌మీనాకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు కేఎస్ సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకినాడ కలెక్టరేట్‌లో జేసీ రాహుల్‌మీనాకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. యాప్‌లు, అసెస్మెంట్ బుక్లెట్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిటీని నియమించాలన్నారు. 30శాతం మధ్యంతరభృతిని విడుదల చేయాలన్నారు. ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25లక్షలకు పెంచాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేయడం తగదన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు గోరస దుర్గాప్రసాద్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్వేయర్లు లేకుండానే.. సర్వే!

- గ్రామాల్లో కొనసాగుతున్న స్వామిత్వ సర్వే పనులు
- పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతోనే సరి
- వారూ లేకుంటే స్థానికులతో సర్వే
- త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిపై అధికారుల ఒత్తిడి



జిల్లా పరిధిలోని ఓ గ్రామంలో సర్వేయర్ లేకుండానే ఇంటి వద్ద కొలతలు తీస్తున్న పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వమిత్వసర్వే జరుగుతోంది. ఇది మెరుగైన సాంకేతికతతో కూడిన సర్వే. మ్యాపింగ్ కోసం ప్రారంభించిన ఆస్తి సర్వే కార్యక్రమం. ఆస్తి డేటాను సేకరించేందుకు డ్రోన్లతో సహా వివిధ సాంకేతికతను ఉపయోగించాలి. కానీ, క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా జరుగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

స్వామిత్వ యోజన పథకం

ఆర్థిక లిక్విడిటీని పెంచుతూ కచ్చితమైన భూరికార్డులను అందించడం ద్వారా ఆస్తి వివాదాలను తగ్గించడానికి ఈ పథకాన్ని ఉద్దేశించారు. ప్రణాళిక, ఆదాయ సేకరణను క్రమబద్ధీకరించడం, గ్రామీణ ప్రాంతాల్లోనే ఆస్తిహక్కుల గురించి నివాసితులకు తెలియజేయడం ఈ పథకం లక్ష్యం. జిల్లాలో ఈ కార్యక్రమం రోవర్లు, సర్వేయర్లు లేకుండా అనుభవం లేని సిబ్బంది సర్వే పనులు చేపట్టడంతో సమస్యలు వస్తున్నాయి. జిల్లాలోని గ్రామాల్లో ఇప్పటికీ ఎక్కువశాతంమంది తమ నివాసాలకు ఆస్తిపత్రాలు లేక కొలతలు తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను చక్కదిద్దేందుకు స్వామిత్వ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్, ఇంజనీరింగ్, డిజిటల్ సహాయకులు బృందం వెళ్లి సర్వే చేపట్టాలి. కానీ జిల్లాలోని గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతున్న స్వామిత్వ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మాత్రమే వెళ్లి సర్వే చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కూడా అందుబాటులో లేనప్పుడు స్థానిక వ్యక్తులతో సర్వే చేయమని అధికారులనుంచి ఒత్తిడి వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో క్షేత్రస్థాయిలో సర్వే పనులు లోపభూయిష్టంగా జరుగుతున్నట్లు గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోవర్లు ఉపయోగించకుండా..

ఇళ్లస్థలాలకు కొలతలు వేసే సమయంలో రోవర్లు ఉపయోగించాలి. అవి లేకుండా ప్రక్రియ సాగుతోంది. టేపులతో కొలతలవల్ల తమ ఆస్తులకు సంబంధించి తేడాలు వస్తాయని పలువురు చెప్తున్నారు. వీఆర్‌వోలు ఇతర పనుల పేరుతో సరిగ్గా హాజరుకాకపోవడం, సర్వేయర్లు కార్యక్రమాలకు దూరంగా ఉండడంతో ఖాళీ స్థలాలకు హద్దులు తెలియక ఇంటి యజమాని ఏది చెప్తే అదే పరిగణనలోకి తీసుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో వివాదాలు తలెత్తే అవకాశాలు కలుగుతున్నాయి. అధికారులు స్పందించి లోపాలు సవరించి సర్వే సక్రమంగా సర్వేయర్లతో జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అనుభవం లేని వారికి బాధ్యతలు

కేంద్రం పంచాయతీరాజ్‌శాఖ పల్లెల్లో స్వామిత్వ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి ఇంటింటా కొలతలు వేయాలన్నా, రికార్డుల్లో నమోదు చేయాలన్నా సర్వేయర్ పాత్రే కీలకం. అలాంటి వారు లేకుండా అనుభవం లేని గ్రామ సహాయక ఇంజనీర్లకు బాధ్యతలను అప్పగించారు. దీంతో కొలతలు తీయడంలో లోపాలు తలెత్తుతున్నాయి. కొందరు అనుభవం ఉన్న సర్వేయర్లను పక్కన పెట్టారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనుల్లో నిమగ్నం కావాల్సిన ఇంజనీరింగ్ సహాయకులు ఆ పనులను పక్కనబెట్టి అనుభవంలేని సర్వే పనులకు వెళ్తున్నారు. దీంతో పనులు ఆగిపోతున్నాయని పీఆర్ అధికారులు లబోదిబోమంటున్నారు.

సమగ్ర పరిష్కారం కావాలి

సర్వేయర్లు లేకుండా కొలతలు తీస్తే తమ ఆస్తులు, సరిహద్దులు, హక్కులు సక్రమంగా గుర్తింపు పొందలేవని, లోపభూయిష్టంగా జరుగుతున్న సర్వేవల్ల పక్షపాతం, అనవసర వివాదాలు మాత్రమే పెరుగుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. స్వామిత్వ సర్వే ప్రజలకు భరోసా కల్పించే ప్రధాన పథకమే, కానీ ఇలాంటి చర్యలవల్ల అందరి ఆకాంక్షలు నెరవేర్చడం కష్టమని వారు అంటున్నారు. సక్రమంగా, పారదర్శకంగా సర్వేలు జరగాలని ప్రజలు అధికారులు దృష్టికి తీసుకెళ్తున్నారు.

పంచాయతీ కార్యదర్శుల ఆవేదన

స్వామిత్వ సర్వేలో పాల్గొనాల్సిన సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొనడం లేదు. జిల్లాలోని చాలా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో సర్వేకు ఏసిబ్బందిని ఉపయోగించుకుని చేయాలో తెలియక గ్రామ కార్యదర్శులు తలపట్టుకుంటున్నారు. సర్వేలో ఏదైనా సమస్యలు వస్తే, అవి పూర్తి బాధ్యతగా కార్యదర్శుల మెడకు చుట్టుకునే అవకాశం ఉంది. దీంతో స్వామిత్వ సర్వే పనులు కాకుండా, ఇంటి పన్ను వసూళ్లు పంచాయతీ పరిపాలన విధులు(జీఎస్‌డబ్ల్యూఎస్) సర్వేల నిర్వహణ వంటి కార్యక్రమాలతో భాగమై తక్కువ సిబ్బందితో భారాన్ని ఎలాఅధిగమించాలో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాకు 800 మెట్రిక్ టన్నుల యూరియా

- నేడు టోకెన్ల ద్వారా పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ),సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాకు తాజాగా మరో 800 మెట్రిక్ టన్నుల యూరియా ప్రభుత్వం కేటాయించింది. దాన్ని బుధవారం ద్వారపూడి నుంచి జిల్లాలో అన్ని పీఏసీఎస్‌లు, రైతు సేవాకేంద్రాలు, ప్రైవేటు ఎరువుల డీలర్లకు పంపిస్తారు. తర్వాత టోకెన్ల విధానంలో రైతులకు పంపిణీచేస్తారు. వర్షాల కారణంగా విశాఖపట్నం సీపోర్టులో నిలిచిపోయిన 500 మెట్రిక్‌టన్నుల యూరియా వాహనాల ద్వారా బుధవారం రాత్రికి కాకినాడకు చేరుకుంటుంది. ఈ నిల్వలను గురువారం నుంచి రైతులకు అందించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత లేదన్నారు. రైతులు అవసరం మేరకే వినియోగించాలన్నారు. జిల్లాలో రైతులు మండలస్థాయిలో ఉన్న వ్యవసాయశాఖ అధికారుల సూచనలను తీసుకుని యూరియాను సమపాళ్లలో ఉపయోగించాలన్నారు.

నేడు విశ్వకర్మ జయంతి

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం విశ్వకర్మ జయంతిని కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన వెలువరించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహిస్తామన్నారు.

హత్య కేసులో దంపతులకు పదేళ్ల జైలు 7

లారీ ఢీకొని వ్యక్తి మృతి 7

మనస్తాపంతో హిజ్రా ఆత్మహత్య


ప్రమాదకరమైన వాగు దాటి సరుకులు తీసుకెళ్తున్న ఏరువాడ కొండరెడ్లు

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు దాటుతున్నా ఆ గ్రామస్తులకు నేటికీ రోడ్డు సౌకర్యం లేదు. వారు బాహ్య ప్రపంచానికి రావాలంటే కొండలు ఎక్కి దట్టమైన అడవిలో కాలిబాటన పయనించాల్సిందే. అంతేకాదు పలు ప్రమాదకరమైన ఏరులు, వాగులు కూడా దాటాలి. దట్టమైన అడవిలో క్రూర మృగాల బారిన పడినా, వాగులు దాటేటప్పుడు ప్రమాదవ శాత్తు మునిగిపోయినా చేసేదేమీ లేదు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు తలెత్తినా, రేషన్ తీసుకోవాలన్నా వారికి ఇలాంటి ప్రయాణాలు తప్పట్లేదు.

ఆ గ్రామమే అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం తులసిపాక సమీపంలోని దట్టమైన అడవిలో ఉన్న ఏరువాడ కొండారెడ్డి.

సెల ఏరువాడ


దట్టమైన అడవిలో కాలి బాటన ప్రయాణం


వాగు దాటుతూ...

(మోతుగూడెం-ఆంధ్రజ్యోతి)

ఏరువాడ గ్రామంలో సుమారు 30 కుటుంబాల కొండారెడ్డి ప్రజలు జీవిస్తున్నారు. అడవిలో దొరికేవే వారికి జీవనాధారం. తాగునీటికి నేటికీ వాగులే ఆధారం. స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా ఈ గ్రామానికి రహదారి, విద్యుత్ సౌకర్యాలు కల్పించకపోవడం శోచనీయం. ఇందుకు కారణం ఈ గ్రామం దట్టమైన అడవిలో ఉండడమే. దీంతో అక్కడి ప్రజలు పడే బాధలు వర్ణనాతీతం. జ్వరం వచ్చినా, ఇతర ఆరోగ్య సమస్యలు ఏమైనా తలెత్తినా, ఆ అడవిలో ఏదైనా ప్రమాదం జరిగినా వారు మండల కేంద్రంలోని ఆసుపత్రికి రావాలంటే పెద్ద సాహసమే చేయాల్సి వస్తుంది. దట్టమైన ఏడు గుట్టలను దాటి కాలిబాటన రావాలంటే చాలా కష్టం. ఈ క్రమంలో చాలా మంది ప్రాణాలు పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. రేషన్ సరుకుల కోసం సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న తులసిపాక రావాల్సిందే. రేషన్‌ను కాలి బాటనే కష్టపడి వాగులు, వంకలు దాటి తీసుకెళ్లాల్సిందే.


చిన్న పిల్లతో వాగు దాటుతున్న దృశ్యం



- ఏరువాడ వెళ్లాలంటే ఏరు దాటాల్సిందే!
- దట్టమైన అడవిలో ఓ కొండరెడ్డి గ్రామం
- నేటికీ రహదారి సౌకర్యం లేక అనేక అవస్థలు
- పట్టించుకోని పాలకులు, ప్రభుత్వాలు

ఏరువాడ గ్రామస్తులు ఎన్ని అవస్థలు పడుతున్నా రాజకీయ నాయకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ గ్రామానికి కనీసం అధికారులు కూడా వెళ్లలేని దుస్థితి. వీరి సమస్యలను ఎవ్వరూ పట్టించుకోరు. గ్రామస్తులను బాహ్య ప్రపంచంలోకి తీసు కువచ్చి పునరావాసం కల్పించాలని గతంలో కొంతమంది అధికారులు ప్రయత్నించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో ఏరువాడ గ్రామస్తులు ఆ అడవిలోనే తమ జీవనం కొనసాగిస్తున్నారు. చింతూరు ఐటీడీఏ అధికారులు, జిల్లా అధికారులు స్పందించి ఏరువాడకు రహదారి సౌకర్యం కల్పించాలని, లేదా ఆ గ్రామస్తులను వేరే ప్రాంతానికి తరలించి అక్కడ పునరావాసం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పిల్లల కోసం జీపీఎస్ పాఠశాల ఏర్పాటు

ఏరువాడలో గతంలో ఐటీడీఏ అధికారులు ఒక జీపీఎస్ పాఠశాలను ఏర్పాటుచేసి పిల్లలకు చదువులు నేర్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ స్కూల్లో 11 మంది పిల్లలు మాత్రమే ఉన్నారు. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులకు కనీస సౌకర్యాలు ఉండవు. అయినా వారు ఆ గ్రామంలోనే ఉంటూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడం విశేషం.



రాత్రయితే చిమ్మ చీకట్లో...

ఈ గ్రామానికి అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించలేకపోయారు. సోలార్ లైట్లు ఏర్పాటుచేసినా అవి తాత్కాలికంగానే పనిచేస్తాయి. దీంతో రాత్రివేళ కాగానే ఈ గ్రామం అడవిలో చిమ్మ చీకట్లోనే ఉండిపోతుంది.



మహిళల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టి 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' అమలు నేటి నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు

ఆరోగ్య 'షీ'రి



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మహిళల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా కేంద్రంలోని ఎన్డీఏ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో బుధవారం నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు 15 రోజుల పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణకు వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక కారణాలతో ఆసుపత్రికి వెళ్లలేని స్థితిలో ఉండే వారికి అండగా నిలిచి వారికి వైద్య సాయం అందించడమే 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' (ఆరోగ్యవంతమైన మహిళ-శక్తిమంతమైన కుటుంబం) లక్ష్యం. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఏయే సేవలందిస్తారంటే..

మహిళలు, కిశోర బాలికలకు స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తిస్తారు. గర్భిణులను పరీక్షించి వారికి అవసరమైన పోషకాహార ఆవశ్యకతను వివరిస్తారు. ఎంసీపీ కార్డులు అందిస్తారు. చిన్నారుల్లో సికిల్‌సెల్ అనీమియాను గుర్తించి చికిత్స చేస్తారు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు. మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు, వయోవృద్ధుల ఆరోగ్య పరీక్షలు, పోషణ్ అభియాన్, ఈట్ రైట్, తల్లీబిడ్డ సేవలు, రక్తదాన శిబిరాల నిర్వహణ, ఆయుష్మాన్ వయో వందన ఆరోగ్య కార్డుల పంపిణీ, పరిశుభ్రత, పోషకాహారానికి సంబంధించి సమాచారం, కౌన్సిలింగ్ ఇస్తారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజనలో ప్రత్యేక నమోదు చేస్తారు. సికిల్ సెల్ కార్డు, ఆభ ఐడీ రిజిస్ట్రేషన్ చేస్తారు.

226 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


బసవతారకం హాస్పిటల్ వైద్యులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురంలో నిర్వహిస్తున్న బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులకు మంగళవారం 226 మంది హాజరయ్యారని హాస్పిటల్ వైద్యులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వైద్య బృందంతో చర్చలు జరిపారు. క్యాన్సర్ పట్ల అవగాహన పెరిగి ప్రజలు టెస్టులు చేయించుకోవడానికి ముందుకు వస్తున్నారని వైద్యులు ఆయనకు తెలిపారు. వచ్చే నెలలో గ్రామంలో వేరొక చోట మూడు రోజుల పాటు క్యాంపు నిర్వహించాలని ఎమ్మెల్యే వారిని కోరగా అందుకు అంగీకరించారు. అలాగే ఈ రెండు రోజుల్లో 395 మందికి పరీక్షలు చేశామని క్యాన్సర్ వ్యాధి ఉంటే వారికి చికిత్సలు అందిస్తామన్నారు. బసవతారం వైద్యులు శ్రావణకుమారి, ప్రవళ్లిక, రేణుక, ప్రభాకర్, కృష్ణప్రసాద్‌లతో పాటు బిక్కవోలు, కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు దుర్గాదేవి, విజయలక్ష్మి పరీక్షలు నిర్వహించారు. సొసైటీ చైర్మన్ నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ బుంగా రామారావు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

నేడు నన్నయ వర్శిటీలో రిక్రూట్మెంట్ డ్రైవ్

వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ


సీఆర్‌టీ శిక్షణ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 17న డాక్టర్ రెడ్డీస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మంగళవారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో బీఎస్సీ/ఎంఎస్సీలలో కెమిస్ట్రీ లేదా బయోటెక్నాలజీ పూర్తి చేసి, 10వ తరగతి నుంచి పీజీ వరకూ 60శాతం మార్కులు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. బీఎస్సీ పూర్తి చేసిన వారికి వార్షిక వేతనం రూ.2.10 లక్షలు, ఎంఎస్సీ పూర్తి చేసిన వారికి రూ.2.60 లక్షలు వేతనం ఇస్తారన్నారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తారన్నారు. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారని చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ అధికారి బి.జగన్మోహనరెడ్డిని సంప్రదించాలని వీసీ ప్రసన్నశ్రీ తెలిపారు. కాగా ఈ నెల 17 నుంచి 19 వరకూ ఇంజనీరింగ్ కళాశాలలోని ఈసీఈ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్మెంట్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

రూ.4వేల కోట్ల ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలి

ముంపు గ్రామాల్లో సభలు పెట్టాలి.. ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు అయినాపురపు



సమావేశంలో మాట్లాడుతున్న అయినాపురపు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పోలవరం ఎస్సీ, ఎస్టీ నిర్వాసితులకు రూ.4 వేల కోట్లు ఆర్అండ్ఆర్ ప్యాకేజీని చెల్లించాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీఎస్టీ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించకుండా గృహనిర్మాణాలకు భూసేకరణ చేసిన జిల్లా కలెక్టర్లపై కేసులు నమోదుచేయాలని డిమాండ్ చేశారు.ప్యాకేజీ చెల్లించే వరకు నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదన్నారు. జీలుగుమిల్లి పరిధిలో నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, దీనిపై గ్రామ సభలో చేసిన తీర్మానాన్ని గౌరవించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలలో అక్టోబర్ 3న గ్రామ సభలు నిర్వహించాలని కోరారు.సమావేశంలో మిడియం వెంకటస్వామి, పూనెం విష్ణు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌కు 200 మంది క్రీడాకారులు


పోటీల్లో జిమ్నాస్టిక్స్ చేస్తున్న బాలిక

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో మంగళవారం ఉదయం నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 69వ స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ అండర్-14, 17లో 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు.వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్‌లో ప్రతిభ కనబర్చారు.కార్యక్రమానికి స్కూల్ గేమ్స్ సెక్రటరీలు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, ఒలింపిక్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవిరాజు పాల్గొన్నారు.

నేడు టీటీకి ఎంపికలు

కాగా బుధవారం ఉదయం 9 గంటలకు అండర్-14, 17 బాలురు, బాలికలకు టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక జరుగుతాయని స్కూల్ గేమ్స్ సెక్రటరీలు తెలిపారు. వర్షం కారణంగా రబ్బీ, నెట్ బాల్ గేమ్స్ వాయిదా వేశామని, అవి ఎప్పుడు ఎక్కడ జరుగుతాయో త్వరలో ప్రకటిస్తామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు ఎలిజిబిలిటీ ఫార్మ్స్ మిడ్డే మీల్స్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు కె.శ్రీనివాసరావు 90593 17248/96035 04337 నెంబర్లలో సంప్రదించాలని ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ రవిరాజు తెలిపారు.

నేడు ఎయిర్‌పోర్ట్‌లో యాత్రి సేవా దివస్

విమానాశ్రయ డైరెక్టర్ శ్రీకాంత్



కోరుకొండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి విమానాశ్రయంలో ఈ నెల 17న యాత్రి సేవా దివస్-2025ను నిర్వహించనున్నట్టు విమానాశ్రయ డైరెక్టర్ ఎస్కే శ్రీకాంత్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఎయిర్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ఆధ్వర్యంలో అన్ని విమానాశ్రయాలు ఈ దినోత్సవాన్ని నిర్వహించనున్నాయి. మంగళవారం ఉదయం రాజమండ్రి ఎయిర్‌పోర్టు పరిపాలన భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విమానయానం చేసే ప్రయాణికులకు ప్రపంచ స్థాయి అనుభవాన్ని అందించేందుకు ఏఏఐ తీసుకుంటున్న చర్యలను ప్రతిబింబించేలా ఈ దినోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు.ఈ సందర్భంగా విమానాశ్రయంలో సాంస్కృతిక ప్రదర్శనలు, క్విజ్, పెయింటింగ్ పోటీలు, విమానాశ్రయ భవనాల అలంకరణలు, ప్రయాణికులకు ఉచిత వైద్య పరీక్షలు, అతిథి సత్కారం, అమ్మ పేరుతో ఒక మొక్క (ఏక్ పెడ్ మా కే నామ్) నినాదంతో చెట్లు నాటడం, సీనియర్ సిటిజన్లకు సత్కారం, విద్యార్థులు, ఎయిర్‌పోర్ట్ సిబ్బందితో ముఖాముఖి నిర్వహించనున్నట్టు డైరెక్టర్ తెలిపారు.ప్రయాణికుల సౌకర్యం, భద్రత, సంతృప్తి ప్రాముఖ్యతను పునరుద్ఘాటించడం యాత్రి సేవా దివస్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

జాతీయ రహదారి నిర్మాణాల కోసం డీపీఆర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి, అన్నవరం, రాజమహేంద్రవరం దివాన్‌చెరువు సెక్షన్ పరిధిలో నాలుగు లైన్ల జాతీయ రహదారి(ఎన్‌హెచ్-16) నిర్మాణాల కోసం డీపీఆర్ రూపకల్పన చేస్తున్నారు. దీన్ని ఆమోదించడానికి కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు స్టేక్ హోల్డర్లతో సమావేశం నిర్వహించనున్నట్టు కాకినాడ డీఆర్వో వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన వెలువరించారు. సమావేశానికి జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పెండింగ్ డీఏలను మంజూరు చేయాలి

ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాస్త్రి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దసరా కానుకగా ప్రభుత్వం పెండింగ్ డీఏలను మంజూరు చేయడంతోపాటు 30% ఐఆర్‌ని ప్రకటించి పీఆర్సీ కమిషన్‌ని నియమించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓలేటి వీవీ శాస్త్రి పేర్కొన్నారు. మంగళవారం ఆయన రాజమహేంద్రవరంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సంఘ సభ్యత్వ నమోదును చేపట్టారు. అనంతరం జిల్లా ఆపస్ నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా మండల విద్యాశాఖాధికారుల(ఎంఈవో) బదిలీలు నిర్వహించకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఎంఈవో కార్యాలయాల్లో పని చేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్లు కూడా 22 ఏళ్లుగా ఒకే చోట ఉండిపోయారన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు, సీఆర్పీల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్నారు. వీరందరికీ మినిమం టైమ్ స్కేల్ మంజూరు చేయడంతో పాటు బదిలీలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లోని హెచ్ఎంల పోస్టులను ప్రమోషన్లతో భర్తీ చేయాలన్నారు.

5.47లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి..

ధవళేశ్వరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోదావరి పెరుగుతూ తగ్గుతూ ప్రవహిస్తోంది. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం తగ్గుతుండగా ప్రాజెక్టుల నుంచి విడుదల చేస్తున్న మిగులు నీటి ప్రవాహంతో ఎగువున గోదావరి పెరుగుతోంది. మంగళవారం ఉదయం కాటన్ బ్యారేజ్ నుంచి 5.84లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేసిన అధికారులు ఎగువ నుంచి వస్తున్న ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో సాయంత్రానికి 5,47,004క్యూసెక్కులు మిగులు ప్రవాహాన్ని సముద్రంలోకి విడుదల చేస్తుందన్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.20 అడుగులుగా నమోదైంది. అల్పపీడనప్రభావంతో కురుస్తున్న వర్షాలకు డెల్టా కాలవలకు నీటి విడుదల తగ్గించారు. తూర్పుడెల్టాకు 4200క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1600క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4500 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద తగ్గుముఖం పట్టిన నీటి మట్టం 37.70 అడుగులుగా నమోదైంది.

పిఠాపురం ఆలయాల్లో మహారాష్ట్ర ఎంపీ పూజలు


అప్పా బర్నేకు స్వాముల చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో సౌజన్య

పిఠాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పలు ఆలయాలను మహారాష్ట్ర ఎంపీ, శివసేన పార్లమెంటరీ చీఫ్ విప్ శ్రీరంగ్ అప్పా బర్నే సందర్శించారు. మంగళవారం శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బర్నేను ఈవో ఆర్.సౌజన్య ఆలయ మర్యాదలతో సత్కరించి స్వాముల చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు.అనంతరం అప్పా బర్నే పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.ఆయన్ను ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటం,ప్రసాదాలు అందజేశారు. ఎంపీ వెంట జనసేన నాయకులు పలువురు ఉన్నారు.

బీచ్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు


కొత్తపట్నం వద్ద మరమ్మతులు చేస్తున్న దృశ్యం



కొత్తపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ సమీపంలో కొత్తపట్నం వద్ద అలల ధాటికి కోతకు గురైన రక్షణ గట్టుకు, బీచ్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కొత్తపట్నం వద్ద బీచ్‌రోడ్డుకు రక్షణగా గతంలో ఏర్పాటుచేసిన బండరాళ్లు, బీచ్‌రోడ్డు కోతకు గురవడం విధితమే. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో పెద్ద సైజు బండరాళ్లను కొత్తపట్నం తరలించి తాత్కాలికంగా కోత నివారణకు చర్యలు చేపట్టారు. అలాగే కొత్తపట్నం, సుబ్బంపేట వద్ద రోడ్డుకు ఏర్పడిన గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు.

నాప్‌కిన్ డిస్పెన్సర్ల ఏర్పాటుకు కొటేషన్లు ఆహ్వానం

ఉమ్మడి తూర్పుగోదావరి పీడీజే సునీత

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 15 కోర్టు సముదాయాల్లోని వాష్‌రూముల్లో శానిటరీ నాప్‌కిన్ డిస్పెన్సింగ్ యంత్రాలు, వినియోగం తర్వాత ధ్వంసం చేసే పరికరాల(ఇన్సినరేటర్) ఏర్పాటు, నిర్వహణకు 119 యూనిట్ల సరఫరా కోసం అనుభవం ఉన్న ఏజెన్సీల నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. సీల్డ్ కవర్‌లో ఈ నెల 30వ తేదీలోపు తమకు కొటేషన్లను అందజేయాలన్నారు. అలాగే జిల్లా కోర్టుల ఆవరణలో ఉన్న రెండు ఎండిన వేప చెట్లను తొలగించడానికి ఈ నెల 25న సాయంత్రం 4.30గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

మోటార్ సైకిళ్లే టార్గెట్..

- ఐదుగురు అంతర్‌జిల్లా దొంగలను పట్టుకున్న పెరవలి పోలీసులు
- రూ.40 లక్షల విలువైన 26 బైక్‌ల స్వాధీనం

పెరవలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిళ్లను చోరీ చేసిన ఐదుగురు అంతర్‌జిల్లా దొంగలను పెరవలి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 26 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ మంగళవారం తూర్పుగోదావరి జిల్లా పెరవలి పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. తుమ్మగుంటి ధనుష్ (తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి), విశ్వనాధుల దేవిశ్రీప్రసాద్, అబ్బిరెడ్డి పాపారావు (కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి)లు కలిసి బైక్ చోరీలకు పాల్పడేవారు. వారి ముగ్గురిని చూసి ధనుష్ తమ్ముడైన నెక్కంటి యువరాజ్ కూడా దొంగతనాలు చేసి డబ్బు సంపాదించాలనుకుని వనచర్ల శక్తిరాజు, కూనపరెడ్డి వీరబాబు(ఖండవల్లి)తో కలిసి మోటారుసైకిళ్ల దొంగతనాలకు పాల్పడ్డారు. వారు దొంగిలించిన మోటారు సైకిళ్లన్నీ వారి ఇళ్ల వద్ద పెట్టుకుని ఒక్కసారిగా అమ్ముదామనుకున్నారని డీఎస్పీ తెలిపారు. వారిలో ఐదుగురిని ఖండవల్లి వద్ద పట్టుకున్నట్టు చెప్పారు. కేసు విచారణలో పెరవలిలో 4, ఉండ్రాజవరంలో 1, రాజమండ్రిలో 6, బొమ్మూరులో 1, పెనుగొండలో 3, పెనుమంట్రలో 2, ఇరగరవంలో 1, రావులపాలెంలో 3, ప్రత్తిపాడులో 2, సామర్లకోటలో 2, తునిరూరల్‌లో 1, విశాఖ జిల్లా ఆనందపురంలో 1, ఎంవీపాలెంలో 1 కేసులు నమోదు కాగా మొత్తం 26 మోటారు సైకిళ్లను దొంగతనం చేసినట్టు తేలిందన్నారు. వాటిలో సుజుకీ మోటారు సైకిళ్లు 15, రాయల్ ఎన్‌ఫీల్డ్ 6, పల్సర్‌బైక్‌లు 4, హెచ్‌ఎఫ్ డీలక్స్ 1 ఉన్నట్టు చెప్పారు. మొత్తంలో 25 కేసుల్లో ఐదుగురు దొంగలను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్ల విలువ సుమారు రూ.40లక్షలు వరకు ఉంటుందని తెలిపారు. ఖండవల్లికి చెందిన మోతరపు శివప్రసాద్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితులను పట్టుకోవడానికి కృషి చేసిన పెరవలి ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వరరావు, నిడదవోలు సీఐ వీవీజీ తిలక్, ట్రైనీ ఎస్‌ఐ కె.సౌజన్య, పోలీసుస్టేషన్ సిబ్బంది కె.శ్రీహరి, నరేంద్ర, ముత్యాలు, గంగాధరరావు, ప్రసాద్, రమేష్, హనుమంతు, శ్రీను, పవన్, సాంబయ్య, జాకీర్ రెహ్మాన్, జి.అనిల్‌ను ఎస్పీ అభినందించినట్టు, వారికి రివార్డులు ఇస్తున్నట్టు డీఎస్పీ పేర్కొన్నారు.



పెరవలిలో వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు డీఎస్పీ, నిడదవోలు సీఐ, పెరవలి ఎస్‌ఐ, ట్రైనీ ఎస్‌ఐ

- సర్పవరంలో యువకుడి అరెస్ట్
- 11 బైక్‌లు స్వాధీనం



సర్పవరంలో నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లతో సీఐ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల చోరీ చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి 11 వాహనాలను సర్పవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వివరాలను కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు మంగళవారం విలేకర్లకు తెలిపారు. బైక్ చోరీల నివారణ, చోరీ సొత్తు స్వాధీనం కోసం కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎ స్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్ పర్యవేక్షణలో సీఐ పెద్దిరాజు ఆధ్వర్యంలో నిందితుల కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టామన్నారు. సామర్లకోట మండలం పండ్రవాడ గ్రామానికి చెందిన పెంకే తేజ(20) బైక్ చోరీలకు పాల్పడుతున్నట్టు గుర్తించి మంగళవారం సర్పవరం ఎస్‌ఐ పి.శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అరెస్ట్ చేశారు. నిందితుడు ఎత్తుకుపోయిన 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని సీఐ పెద్దిరాజు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.6.50 లక్షలు ఉంటుందన్నారు. నిందితుడిని పట్టుకున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌కుమార్, హెచ్‌సీలు సత్తిబాబు, రాజు, గణేష్, కానిస్టేబుల్స్ రవి, శ్రీనివాస్, అనిల్, చిన్నబాబు, కిషోర్‌లను ప్రత్యేకంగా అభినందించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ధర్మవరం హైవేపై ఘటన



మృతిచెందిన నాగేశ్వరరావు



ప్రమాదానికి కారణమైన లారీ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం జాతీయ రహదారిపై మంగళవారం కంటైనర్ లారీ స్కూటీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కథనం మేరకు.. కాకినాడ జిల్లా తొండంగికి చెందిన కడారి నాగేశ్వరరావు, వేముల శ్రీను ప్రత్తిపాడు మండలంలో ఓ చేపల చెరువు వద్ద పనిచేస్తున్నారు. 10 రోజులకు ఒకసారి తమ స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి మళ్లీ చెరువు వద్దకు వస్తుంటారు. ఈ క్రమంలో తొండంగి వెళ్లిన నాగేశ్వరరావు, శ్రీను స్కూటీపై మంగళవారం ప్రత్తిపాడుకు బయల్దేరారు. ధర్మవరం సత్తెమ్మతల్లి గుడి సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి తుని నుంచి రాజమండ్రి వెళ్తున్న కంటైనర్ లారీ ఢీకొంది. ఈ ఘటనలో కడారి నాగేశ్వరరావు(39)అక్కడికక్కడే మృతిచెందగా, వేమల శ్రీను గాయపడ్డాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. తమకు దిక్కు ఎవరంటూ రోధించారు. గాయపడిన రేమాల శ్రీను ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌ఐ లక్ష్మీకాంతం, పోలీస్ సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

అన్నవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా అన్నవరంలో జరిగింది. అన్నవరంలో వెలంపేటకు చెందిన బర్ల సోమరాజు (40) గ్రామంలో ఎలక్ట్రిషియన్‌గా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఒక లేఅవుట్‌లో ఇంటికి పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వేద్దామని స్థానిక విద్యుత్‌శాఖ అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కరెంట్ స్తంభం ఎక్కాడు. అక్కడ వైర్ పట్టుకోవడంతో వెంటనే షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సమయంలో అక్కడ దగ్గర్లో ఉన్న దేవస్థానం సబ్‌స్టేషన్ ట్రిప్ అయినట్టు ఏఈ తెలిపారు. అన్నవరం ఎస్‌ఐ హరిబాబు, ఎలక్ట్రికల్ ఏఈలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.



సోమరాజు (ఫైల్)

పంటకాల్వలోకి దూసుకుపోయిన టాటాఏస్

స్వల్పగాయాలతో బయటపడిన ఐదుగురు జట్టు కార్మికులు

కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మొండెపులంక వద్ద ఘటన

పి.గన్నవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మొండెపులంక వద్ద కాంక్రీటు మిల్లర్‌తో కూడిన టాటా ఏస్ వాహనం మంగళవారం అదుపుతప్పి పంటకాల్వలోకి దూసుకుపోయింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కొత్తపేట మండలం పలివేల గ్రామానికి చెందిన కాంక్రీటు పనిచేసే జట్టు కార్మికులు పనినిమిత్తం రాజోలు మండలం జగ్గన్నపేట వెళ్లారు. పని ముగించుకుని తిరిగివచ్చే క్రమంలో మొండెపులంక వచ్చే సరికి అదుపు తప్పి పక్కనే పంటకాల్వలోకి దూసుకుపోయింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న ఐదుగురు జట్టు కూలీలు స్వల్పగాయాలతో బయటపడగా కాంక్రీటు మిల్లరు, టాటా ఏస్ వాహనం పూర్తిగా మునిగిపోయాయి. స్థానికుల సాయంతో వాహనాలను, కాంక్రీటు పనులకు వినియోగించే ఇనుప నిచ్చెనలను బయటకు తీశారు. అలాగే పలువురు సెల్‌ఫోన్‌లు సైతం నీటిలో మునిగిపోయినట్టు బాధితులు పేర్కొన్నారు.



మొండెపులంక వద్ద పంటకాల్వలోకి దూసుకుపోయిన టాటాఏస్, కాంక్రీటు మిల్లరు

రైస్‌మిల్లర్‌కు బెదిరింపులు.. పి.గన్నవరంలో అధికారుల విచారణ

పి.గన్నవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థ సభ్యుడిగా వ్యవహరిస్తున్న వ్యక్తి రైస్ మిల్లర్‌ను బెదిరించి దందాకు పాల్పడిన ఘటనపై సివిల్‌సప్లయి అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం అక్షయ రైస్ మిల్లు వద్దకు వారంక్రితం ప్రభుత్వ సంస్థ సభ్యుడిగా వ్యవహరిస్తున్న వ్యక్తి ప్రత్యేక వాహనంలో నలుగురితో కలిసి వచ్చాడు. మిల్లులోకి వెళ్లి రేషన్ బియ్యం పక్కతోవ పడుతున్నాయని, లారీతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటామని బెదిరించి రూ.8లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. మిల్లు యజమాని రూ.1.50లక్షలు ఇవ్వడంతో సదరు వ్యక్తి అనుచరులతో అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఈవిషయం ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. దీంతో జిల్లా సివిల్ సప్లయి మేనేజర్ పి.శ్రీనివాస్, ఎంఎస్‌వోలు ఎండి ఇస్మాయిల్, పూర్ణిమ, భారతి మిల్లు వద్దకు వెళ్లి స్టాక్ రిజిష్టర్లు, స్టాకు పరిశీలించారు. ఘటనపై మిల్లు యజమానితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ విషయమై శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ నిర్వహించామని నివేదికను అధికారులు అందిస్తామని వివరాలు వారే వెల్లడిస్తారని తెలిపారు.

రైతుల బాధలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తా

ఎమ్మెల్సీ సోము వీర్రాజు

మలికిపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ పొంగి లక్షలాది కొబ్బరిచెట్లు చనిపోయి తీర ప్రాంత గ్రామాల్లోని రైతులు పడుతున్న బాధలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా ప్రయత్నిస్తానని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలోని తుఫాన్ సెంటర్ భవనంలో రైతులు, ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు సస్యశ్యామలంగా ఉండే తీర ప్రాంతంలో కేశనపల్లి, తూర్పుపాలెం, శంకరగుప్తం తదితర గ్రామాలను చూస్తుంటే గుండె తరుక్కుపోతుందన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో శంకరగుప్తం డ్రెయిన్ పొంగి లక్షలాది కొబ్బరిచెట్లు చనిపోయి రైతులకు అపార నష్టం కలుగుజేస్తున్నాయని, శాశ్వత పరిష్కారాలు ప్రభుత్వాలు చూపకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు సోము దృష్టికి తీసుకువచ్చారు. సోము మాట్లాడుతూ ఈప్రాంత సమస్యను స్వయంగా చూశానని, కొబ్బరిచెట్లు చనిపోవడం తీవ్రంగా కలచివేస్తుందని, స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అసెంబ్లీలో ప్రస్తావిస్తారని తెలిసిందని, తాను కూడా శాసనమండలిలో ప్రస్తావించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తానన్నారు. కేశనపల్లిలో చనిపోయిన కొబ్బరిచెట్లను పరిశీలించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్,మండలాధ్యక్షుడు మేడిచర్లచాణుక్య ఉన్నారు.



కేశనపల్లిలో కొబ్బరిచెట్లను పరిశీలిస్తున్న సోము

కోర్టు ఆదేశాల ధిక్కరణ.. పంచాయతీ కార్యదర్శికి వారం రోజులు జైలు


అమలాపురం రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలను ధిక్కరించిన కేసులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం గున్నేపల్లి అగ్రహారం పంచాయతీ కార్యదర్శి దుర్గాభవానీకి వారం రోజులు జైలు శిక్ష విధించింది. ఆ శిక్షను రెండు రోజుల పాటు నిలుపుదల చేసి ఈనెల 17న కోర్టుకు హాజరుకావాలని కార్యదర్శిని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గున్నేపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన ముత్తాబత్తుల సత్యనారాయణ తాను తక్కువ కులం వాడిని కావడంతో గ్రామంలో రాజకీయం చేసి తమ ఇంటి ఎదురుగా మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు చేపడుతున్నట్టు ఈ ఏడాది జనవరిలో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై న్యాయవాది మాకిరెడ్డి మనోజ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. రిట్‌పై టి.రాజశేఖర్ ధర్మాసనం అన్ని అంశాలను పరిశీలించి ఆ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేశారు. అయితే హైకోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులను ధిక్కరించి అదే ప్రాంతంలో మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. ఈనెల 15న కోర్టు ఉత్తర్వుల ధిక్కరణపై న్యాయవాది మనోజ్ కంటెంప్ట్ ఆఫ్ ది కోర్టు పిటిషన్‌పై దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయవాది వాదనలతో ఏకీభవించింది. పంచాయతీ కార్యదర్శి దుర్గాభవానీని వారం రోజుల పాటు జ్యుడిషియల్ కస్టడీకి తీసుకోవాలని ఆదేశించింది. జైలు శిక్షను రెండు రోజుల పాటు నిలుపుదల చేసి ఈ నెల 17న కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. ఇలా ఉండగా జలజీవన్ మిషన్ నిధులతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేశారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే పలువురు అధికారులకు జిల్లా ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది.

రమణయ్యపేట - జె.అన్నవరం రోడ్డుకు తక్షణం మరమ్మతులు చేయాలి

డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం

ఏలేశ్వరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని రమణయ్యపేట నుంచి జె.అన్నవరం వరకు ఉన్న రోడ్డుకు తక్షణం మరమ్మతులు చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డు దుస్థితిపై వివిధ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాలపై ఆయన స్పందించి ఆదేశాలు ఇచ్చారు. వెంటనే రహదారిపై ఉన్న గుంతలను పూడ్చాలని కాకినాడ జిల్లా అధికారులను ఆదేశించారు. నేషనల్ డవలప్‌మెంట్ బ్యాంక్ ధనంతో ఈ రహదారిని త్వరలో పునఃనిర్మిస్తారన్నారు. పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రయాణికులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చేయాలని పవన్ సూచించారు. గుంతలు లేని రహదారులు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం సామాజిక మాధ్యమంలో వివరించారు.

‘ఏలేరు’లో పెరుగుతున్న నీటి నిల్వలు



ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

ఏలేశ్వరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. గోదావరి జలాలు, మెస్తారు వర్షాలు రిజర్వాయర్‌లో వచ్చి చేరడంతో నీరు పెరుగుతోంది. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 1400 క్యూసెక్కులు ఏలేరు జలాశయానికి విడుదలవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 82.41 మీటర్ల స్థాయిలో 16.48 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 175 క్యూసెక్కులు వంతులకు నీరు చేరుతోంది. దీంతో సాగు నీరు విడుదలవ్వడంతో రైతులకు పంటలపై భరోసా ఏర్పడింది.

ఆటోను ఢీకొన్న లారీ

ఇంటి మీదకు వెళ్లిన వైనం

నలుగురికి గాయాలు



ఇంటి మీదకు వెళ్లిన ఆటో

ఎటపాక, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్యాసింజర్ ఆటోని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఆటో ఓ ఇంటి మీదకు వెళ్లగా నలుగురికి గాయాలైన సంఘటన మంగళవారం ఎటపాక మండలం బండిరేవు వద్ద జరిగింది. గౌరిదేవిపేట గ్రామానికి చెందిన డయాలసిస్ రోగిని చింతూరు ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లి ఆటోలో ఇంటికి వస్తున్న క్రమంలో బండిరేవు వద్దకు రాగానే వెనుక వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆటో జాతీయ రహదారి పక్కన ఉన్న ఇంటి మీదకు వెళ్లిపోయింది. ఆటో డ్రైవర్ డి.రామారావుతోపాటు ఇద్దరు ప్రయాణికులు, డయాలసిస్ రోగికి గాయాలయ్యాయి.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

రంపచోడవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో మంగళవారం గంగవరం మండలంలో దాడులు నిర్వహించి 10 మద్యం బాటిళ్లతో వీర వెంకట సత్యనారాయణను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సారా కేసుల్లో నిందితులుగా ఉన్న 8 మందిని అరెస్టు చేశామన్నారు. అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

హత్య కేసులో దంపతులకు పదేళ్ల జైలు

పెద్దాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హత్యకేసులో భార్యభర్తలకు కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించినట్టు పెద్దాపురం సీఐ పి.విజయశంకర్ తెలిపారు. 2022లో కాకినాడ జిల్లా పెదాపురం మండలం జి.రాగంపేట గ్రామానికి చెందిన ఆదిన ప్రసాద్, అతడి భార్య లక్ష్మి సరిహద్దు తగాదా నేపథ్యంలో జరిగిన ఘర్షణలో పాలాని మంగను ఇంటి మెట్లపై నుంచి తోసివేయడంతో మృతిచెందింది. దీంతో మృతురాలి కుమార్తె కరెళ్ల పాపారత్నం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్‌ఐ పి.శివకుమార్ కేసు నమోదు చేశారు. దీనిపై వాదోవాదాలు జరిగి నేరం రుజువు కావడంతో నిందితులకు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దీప దైవకృప 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధించారు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు గన్నంరాజు వినయ్ తేజ, రాగం కామేశ్వరరావు వాదనాలు వినిపించారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి ఆరునెలల జైలు

పిఠాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి తీర్పు చెప్పారు. ఫిర్యాది తరఫు న్యాయవాది బీవీవీ సత్యనారాయణ రాజు అందించిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన గన్నేరు ఈశ్వరరావు వద్ద నాగులాపల్లికి చెందిన కేపీ రెడ్డి రూ.3.85లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దీనిపై అతడు ఇచ్చిన చెక్‌బౌన్స్ కావడంతో అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు దాఖలు చేయగా 2022లో 6నెలల జైలు శిక్ష, అప్పు చెల్లించని పక్షంలో మరో 3 నెలలు జైలుశిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు. దీనిపై కేపీ రెడ్డి జిల్లా కోర్టులో అప్పీలు చేయగా కింద కోర్టు తీర్పునే ఖరారు చేసింది.

ఆయిల్ దొంగతనానికి యత్నం నలుగురి అరెస్ట్

కేసు నమోదు

తొండంగి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం రావికంపాడు సమీపంలో సోమవారం రాత్రి ఐవోసీఎల్ పైపులైన్ నుంచి ఆయిల్ దొంగతనానికి ప్రయత్నించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు తెలిపారు. మంగళవారం తొండంగి పోలీస్‌స్టేషన్‌లో దీనికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. నలుగురు గునపాలు, పారలు పట్టుకుని పైప్‌లైన్ వద్ద మట్టి తవ్వుతుండగా వాహనాలు రావడంతో అక్కడి నుంచి పారిపోయారు. ఈ విషయం తెలుసుకుని ఐవోసీఎల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేయగా నలుగురు వ్యక్తులు ఈ సంఘటనలో ఉన్నట్టు గుర్తించామన్నారు. చక్కా శంకర్, రచ్చ భాగరాజు, కర్రి కేశవ్, దడాల ఆంజనేయులను అరెస్టు చేసి విచారించామన్నారు. వారిలో శంకర్, భాగరాజులపై సమీప పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నాయన్నారు. నలుగురిని అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. ఎస్‌ఐ జగన్మోహన్ ఉన్నారు.

పంటకాల్వలో యువకుడి మృతదేహం లభ్యం



తాండవపల్లిలో లభ్యమైన మృతదేహం

అమలాపురం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తాండవపల్లి గ్రామంలోని శెట్టిపల్లి పంటకాల్వలో మంగళవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్టు అమలాపురం తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. మృతుడి వయసు 25 నుంచి 30సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతదేహం పూర్తిగా ఉబ్బిపోయి ఉందని.. తెలుపు, నీలం రంగు షర్టుతో పాటు కుడిచేతి మీద దీపిక పేరుతో పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే తాలూకా ఎస్‌ఐ సెల్ 9440796562, తాలూకా సీఐ 9440796525కు సమాచారం అందించాలని కోరారు.

స్వగ్రామానికి కోనసీమ మహిళ మృతదేహం



విజయ భారతి (ఫైల్)

మలికిపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో అనారోగ్యంతో మృతి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మహిళ మృతదేహం 13 రోజులకు స్వగ్రామానికి చేరింది. మలికిపురం మండలం పెదతిప్ప గ్రామానికి చెందిన రాపాక విజయభారతి(56) నాలుగేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లింది. ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో స్పృహ కోల్పోయి యజమాని ఇంట్లో చనిపోయింది. దీంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి కావాల్సిన కార్యక్రమాలను అక్కడే ఉంటున్న పెదపాటి సురేష్, నల్లి చిన్నా, నల్లి శృతి ఎంబసీ సహాయంతో పూర్తిచేశారు. మృతదేహాన్ని నల్లి శృతి దగ్గరుండి తీసుకురావడంతో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తీసుకురావడానికి ఎటువంటి ఖర్చు లేకుండా ఆంధ్రప్రదేశ్ నాన్‌రెసిడెన్స్ తెలుగు సొసైటీ ద్వారా నల్లి శంకర్ సహాయంతో స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతదేహానికి రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, గెడ్డం తులసీభాస్కర్, గెడ్డం ఫిలిప్‌రాజు, నల్లి శివ నివాళులర్పించారు.

రైలు నుంచి జారి పడి విద్యార్థికి తీవ్ర గాయాలు

తుని రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఉదయం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారి పడి అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గరికిన హేమన్ రాజు తీవ్ర గాయాలపాలయ్యాడు. కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న హేమన్‌రాజు రోజూ తుని నుంచి రైల్లో సామర్లకోట వరకు వెళ్లి అక్కడ నుంచి కళాశాలకు వెళ్తుంటాడు. మంగళవారం రద్దీ ఎక్కువగా ఉండడంతో రైలు ఎక్కే క్రమంలో కిందకు జారిపడ్డాడు. అతడి కాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తుని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం నిమిత్తం వైద్యుల సిఫార్సు మేరకు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించినట్టు రైల్వే జీఆర్పీ ఎస్‌ఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

మనస్తాపంతో హిజ్రా ఆత్మహత్య



జాస్మిన్ (ఫైల్)

కాకినాడ క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ హిజ్రా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ తూరంగిలోని మహాలక్ష్మినగర్‌కు చెందిన హిజ్రా జాస్మిన్ (19) కొద్ది రోజుల క్రితం ఓ అబ్బాయిని ప్రేమించింది. అయితే అతడికి జాస్మిన్‌తో విభేదాలు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి తన ఇంటిలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయంపై ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ముగిసిన యోగా శిక్షణ తరగతులు

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రామకృష్ణారావు పేట గాంధీభవన్‌లో వారం జరిగిన యోగా శిక్షణ తరగతులు మంగళవారం ముగిసాయి. సద్గురు జగ్గీవాసుదేవ్ కోయంబత్తూరు నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఇన్నర్ ఇంజనీరింగ్ యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ప్రధానంగా శాంభవి మహా ముద్ర క్రియ చేయించారు. కాకినాడ సెంటర్ కో-ఆర్డినేటర్ సాగర్, వలంటీర్లు పాల్గొన్నారు.



విజేతలతో సమగ్ర శిక్షా ఏఎంవో జగన్మోహన్, జిల్లా సైన్స్ అధికారి వినీల్

'వారధి' జిల్లా స్థాయి పోటీల విజేతలు వీరే

కాకినాడ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా విద్యా శాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో కాకినాడ సాలిపేటలోని పీఎస్ రాజు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం వారధి జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఏఎంవో వి. జగన్మోహన్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని 19 మండలాల నుంచి 38 గ్రూపులు హాజరు కాగా వ్యాసరచనలో నవభారత్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు, వక్తృత్వ పోటీలో సాంబమూర్తినగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు విజయం సాధించారు. సుదర్శనబాబు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, గోవిందరాజులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలను డీఈవో పిల్లి రమేష్ అభినందించి రాష్ట్ర స్థాయిలో కూడా రాణించాలని కోరారు.



సాధన-2కే25 పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చేబ్రోలులో సాధన-2కే25 టెక్ హ్యాక్‌థాన్

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు సాధన 2కే25 టెక్ హ్యాక్‌థాన్ నిర్వహించనున్నారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సంబంధిత పోస్టర్లను జేఎన్టీయూకే మాజీ ఉప కులపతి, సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ మురళీకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు, సెక్రటరీ అనురాధ, డైరెక్టర్ బుర్రా అఖిలేష్, ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఈఎస్ రాజశేఖర్, డీన్ ఎస్.కొండలరావు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు టి.ప్రేమ్‌బాస్కో, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



డీఆర్డీఏ పీడీ శ్రీనివాసుకి వినతిపత్రం ఇస్తున్న సంఘ ప్రతినిధులు

'కాల పరిమితి జీవో రద్దు చేయాలి'

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యానిమేటర్ల మూడేళ్ల కాలపరిమితి జీవోను రద్దు చేయాలని, మూడు నెలల వేతన బకాయిలను తక్షణం చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ వీవోఏ యానిమేటర్ల ఉద్యోగుల సంఘం సభ్యులు కాకినాడలోని డీఆర్డీఏ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్డీఏ పీడీ శ్రీనివాసుకి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగాభవాని, ఈశ్వరిబాయి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ వీవోఏల సమస్యలను వేగంగా పరిష్కరించాలన్నారు. చిన్నబుల్లి, మేరీ, సుశీల, ఈశ్వరి పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటుపై నిరసన

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని సౌజన్య కాలనీ, శశికాంత్‌నగర్ కాలనీలో ఓ భవనంపై నిర్మిస్తున్న సెల్ టవర్‌కు వ్యతిరేకంగా ఆ కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు అంతస్తుల భవనంపై సెల్‌టవర్ నిర్మిస్తున్నారన్నారు. సమీపాన సుమారు 50 మీటర్ల పరిధిలో గాంధీ సెంటినరీ, మున్సిపల్ స్కూల్స్, పార్కు వున్నాయన్నారు. సెల్ టవర్ ఏర్పాటు చేస్తే దాని నుంచి వెలువడే రేడియేషన్ ప్రభావంతో సమీపంలో గల విద్యార్థులు, కాలనీ వాసుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని సెల్‌టవర్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.



సెల్ టవర్ నిర్మాణం వద్దంటూ ఆందోళన చేస్తున్న సౌజన్యనగర్ కాలనీ వాసులు



చైర్‌పర్సన్ మణికుమారి-చక్రవర్తి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట ఏఎంసీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం

సామర్లకోట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సామర్లకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ చైర్‌పర్సన్‌గా అందుగుల మణికుమారిచక్రవర్తి, సభ్యులుగా వెంకటకృష్ణ భవన్నారాయణ, పోతుల సీతామహాలక్ష్మి, అడపా భార్గవిచక్ర, కొటికలపూడి నవీన్, తలాటం అచ్యుతరామయ్య, బండే అమలావతి, పుప్పాల దుర్గ, కేశన కృపమ్మ, పిల్లి శ్రీనివాసరావు, పిల్లా రామకృష్ణ, లింగం ఉష, మల్లిపూడి వెంకటగంగారావు, దేవిశెట్టి ఏసుబాబు, మర్రి రాఘవలతో తెలుగు రైతు కాకినాడ పార్లమెంటరీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు ప్రమాణం చేయించారు. చైర్‌పర్సన్ మణికుమారిచక్రవర్తిని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), కూటమి పార్టీల నాయకులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్లూరి సూరిబాబు, టీడీపీ జిల్లా నాయకులు బోళ్ల వెంకటరమణ, నిమ్మకాయల రంగనాగ్, రాజా సూరిబాబురాజు, స్థానిక నాయకులు అడబాల కుమారస్వామి, కంటే జగదీష్ మోహన్ (బాబు), బడుగు శ్రీకాంత్, బలుసు శ్రీనివాసు, దేవళ్ళ జయలక్ష్మి, తోటకూర శ్రీనివాసు, పైణ్ణి శ్రీనివాసు, తోట వెంకటేశ్వరరావు, బత్సల వెంకటరమణ, కొండపల్లి కృష్ణమూర్తి, గుమ్మళ్ళ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల ఆర్థిక స్థితి పెంచేందుకే పీ4 పథకం

ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆర్థికంగా అభివృద్ధి చెందిన కుటుంబాలు కింది స్థాయి కుటుంబాలను దత్తత తీసుకునేందుకు పీ4 పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. మంగళవారం రాత్రి హుస్సేన్‌పురంలో ఆర్డీవో కె.శ్రీరమణి అధ్యక్షతన పీ4 గ్రామ సదస్సు నిర్వహించారు. గ్రామంలో ఎనిమిది బంగారు కుటుంబాలను గుర్తించి తాను స్వయంగా దత్తత స్వీకరిస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రకటించారు. ఆయా కుటుంబాలతో ఎమ్మెల్యే, ఆర్డీవో సమీక్షించారు. తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, టీడీపీ నాయకులు పాలకుర్తి శ్రీనుబాబు, రాజా సూరిబాబురాజు, గుమ్మళ్ళ రామకృష్ణ, చల్లా బుజ్జి, బడుగు శ్రీకాంత్, బలుసు శ్రీనువాసు, అత్తిలి కృష్ణ, కోటఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.



దత్తత తీసుకున్న కుటుంబాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప, చిత్రంలో ఆర్డీవో శ్రీరమణి

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగబాబు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఎన్నికలు మంగళవారం వెంకట రత్నపురంలోని గాంధీభవన్‌లో ప్రశాంతంగా జరిగాయి. ఓట్ల లెక్కింపు అనంతరం జిల్లా అధ్యక్షుడిగా మెలిపాక నాగ సత్యనారాయణ (నాగబాబు) గెలుపొందినట్టు ఎన్నికల కమిటీ ప్రకటించింది. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ జిల్లాలో అందరినీ కలుపుకుని నాయీ బ్రాహ్మణ కుల అభివృద్ధికి, సంఘ అభివృద్ధికి పాటుపడతానన్నారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు. కార్యక్రమంలో ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కాకినాడ సిటీ అధ్యక్షుడు వేపాడ శ్రీనివాసరావు, జిల్లా, పట్టణ, మండల స్థాయి నాయకులు స్వయంవరపు వీరభద్రరావు, పొట్నూరి అప్పారావు, కొమ్మన అప్పన్న, తమిరి నాగేశ్వరరావు, మల్లువలస విష్ణుచక్రం, దోమాడ సూరిబాబు, అల్లవరపు శ్రీను, కోట ఉమాఅచ్యుత రమణ, గుణ్ణంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గెలుపొందిన నాగబాబును సత్కరిస్తున్న సంఘీయులు



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ జానకి

సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన

పెద్దాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌బీ పట్నం గ్రామంలో ఉద్యానవన శాఖాధికారులు సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.జానకి మాట్లాడుతూ కర్ర పెండలం సాగు చేసే రైతులు వ్యవసాయాధికారుల సూచనలను తప్పక పాటించాలన్నారు. ఎరువుల వాడకం, చీడపీడల నివారణ తదితర అంశాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలపై అవగాహన కల్పించారు. ఉద్యానవన శాఖ మండల అధికారి కటకం శైలజ, కూటమి నేతలు మన్యం ప్రసన్నకుమార్, కల్యారి శ్రీనివాస్, నల్లల శ్రీనివాస్, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్'

గోడ ప్రతిక ఆవిష్కరణ

సామర్లకోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్'ను సామర్లకోట సీహెచ్‌సీ ఆసుపత్రిలో బుధవారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించనున్నారు. సంబంధిత గోడ పత్రికను సామర్లకోట సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అమల, వైద్యుల సమక్షంలో ఎమ్మెల్యే చినరాజప్ప ఆవిష్కరించారు.

రక్షిత మంచినీటి పథకం తనిఖీ

కొత్తపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాకతిప్పలోని నాగులాపల్లి ఏరియా సమగ్ర గ్రామీణాభివృద్ధి రక్షిత మంచినీటి పథకాన్ని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈఈ అబుల్ మతీన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంచినీటి రిజర్వాయర్, ఫిల్టర్ బెడ్‌లు, ఆలమ్, గ్యాస్‌లను పరిశీలించారు. మండలంలో చివరి గ్రామం వరకు ప్రజలు ఇబ్బంది పడకుండా నిత్యం తాగునీరు సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎక్కడైనా చిన్న చిన్న మరమ్మతులుంటే వెంటనే సరిచేయా లన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ రమణ, డీఈఈ ఎస్ఈఈ అబ్దుల్ మతీన్ వెంట వున్నారు.



కుళాయిల నుంచి బురద నీరు!

పిఠాపురంలో కుళాయిల ద్వారా బురద నీరు సరఫరా అయింది. పట్టణంలోని 29, 30 వార్డుల పరిధిలో మంగళవారం సాయంత్రం రంగుమారిన బురదనీరు కుళాయిలు నుంచి రావడంతో ప్రజలు కలవరానికి గురయ్యారు. కనీసం వాడుక నీటిగా వినియోగించేందుకు పనికిరాని విధంగా నీరు రావడంతో అగ్రహారం పరిసర ప్రాంతాల ప్రజలు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. -పిఠాపురం

'రాష్ట్రంలో యూరియా కొరత లేదు'

పిఠాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత అనేది లేదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ స్పష్టం చేశారు. ఆధార్‌కార్డు, పాసు పుస్తకాలు తీసుకుని కూపన్లు ఇచ్చి యూరియా పంపిణీ చేయడం వలనే రైతుల క్యూలు ఉంటున్నాయని, వీటిపై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో యూరియా అంశంపై మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ చేసిన వ్యాఖ్యలను వర్మ తప్పుపట్టారు. రైతుల అవసరాలకు సరిపడా యూరియాను అందించామని, ఇంకా ఎక్కడైనా డిమాండ్ ఉంటే అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. చేబ్రోలులో ఆందోళన చేసిన రైతులు వస్తే వారికి యూరియా అందిస్తామని ప్రకటించారు. సమావేశంలో పాదగయ మాజీ చైర్మన్ కొండేపూడి ప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా సతీష్, ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, కొరుప్రోలు శ్రీను, సూరవరపు సుబ్బారావు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

'ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఎయిడ్స్‌పై అవగాహన అవసరం'

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని చేంజెస్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పుష్పకుమారి కోరారు. మంగళవారం రమణయ్యపేట శివారు గైగోలుపాడు జడ్పీ హైస్కూల్లో చేంజెస్ సంస్థ, పంపన మహేష్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ-ఎయిడ్స్ లైంగిక వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పకుమారి మాట్లాడుతూ ఇంటెన్సిఫైడ్ ఐఈసీ అవేర్‌నెస్ క్యాంపెయిన్‌లో భాగంగా ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ యూనిట్ పర్యవేక్షణలో ఈ నెల 12 నుంచి అక్టోబరు 30 వరకు జిల్లాలోని ప్రభుత్వ హైస్కూళ్లలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎయిడ్స్ నివారణపై మరింత సమాచారం కోసం టోల్‌ఫ్రీ నెం.1097కు కాల్ చేయాలన్నారు. హైస్కూలు ఉపాధ్యాయులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో శ్రీరమణి



పిఠాపురం ఫైర్ స్టేషన్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

పిఠాపురంలో భారీ వర్షం

పిఠాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండి ఒక్కసారిగా కుండపోతగా వర్షం పడింది. సుమారు గంటపాటు కురిసిన వర్షంతో పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు వీధుల్లోని రోడ్లు జలమయమయ్యాయి. ఎక్కడిక్కడ డ్రైన్లు పొంగిపొర్లడంతో రోడ్లపైకి నీరు చేరింది. సుమారు అడుగు ఎత్తున పలు రోడ్లపై నీరు ప్రవహించడంతో వాహన చోదకులు, ప్రజలు ఇక్కట్లు పడ్డారు. డ్రైన్లల్లో ఉన్న చెత్తాచెదారం రోడ్డు మీదకు చేరడంతో దుర్గంధపూరిత వాతావరణం ఏర్పడింది.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోను, మండలంలోను మంగళవారం భారీ వర్షం కురిసింది. ప్రధాన మురుగుకాల్వల నుంచి మురుగు నీరు రోడ్లపైకి ప్రవహించడంతో రోడ్లు దుర్గంధంగా మారాయి. వర్షానికి ప్రధాన రహదారులన్నీ వాహనాల రాకపోకలకు మరింత గోతులమయంగా మారాయి. ఓవర్ బ్రిడ్జి, కెనాల్‌రోడ్డు, కాకినాడ రోడ్డులలో గోతుల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

టీడీపీ మండల కమిటీ నూతన కార్యవర్గం

తాళ్లరేవు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల శాఖ అధ్యక్షుడిగా ధూళిపూడి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా కట్టా త్రిమూర్తులు తాళ్లరేవులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ప్రమాణం చేశారు. వారికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, చెల్లి అశోక్, మందాల గంగ సూర్యనారాయణ, వుంగరాల వెంకటేశ్వరరావు, వాడ్రేవు వీరబాబు, పిల్లి సత్తిబాబు, మోపూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి

ఆరుద్ర నక్షత్ర పూజలు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దుర్గాడ శివాలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహా గణపతి పూజ, మహన్యాస పారాయణం, ఏకాదశ ద్రవ్య మహా రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి సప్తహారతులు ఇచ్చారు. సేవా సమితి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'కాకినాడ జిల్లాకు పిఠాపురం మహారాజా పేరు పెట్టాలి'

పిఠాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాకు పిఠాపురం మహారాజా పేరు పెట్టే విధంగా ప్రభుత్వానికి విన్నవించేందుకు బుధవారం ఉదయం 11గంటలకు పిఠాపురం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్టు మహారాజా కళాశాల పూర్వ విద్యార్థులు తెలిపారు. కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా నిర్వహించే ఈ సమావేశానికి అందరూ హాజరు కావాలని కోరారు.



శరన్నవరాత్రి వేడుకలకు భువనేశ్వరి పీఠం సిద్ధం

పెద్దాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వర్తుల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో ఈ నెల 22వ తేదీ నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పీఠాధిపతి చింతా గోపిశర్మ తెలిపారు. ఈ నెల 17న పట్టణానికి చెందిన వేముల మురళి-సుష్మ దంపతులు రాట ముహూర్తం చేస్తారన్నారు. ప్రతిరోజూ హోమాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ప్రత్యక్ష, పరోక్ష పూజల్లో పాల్గొనదలచిన భక్తులు 9866193557 నెంబరును సంప్రదించాలని గోపిశర్మ కోరారు.

కోరింగ సొసైటీ త్రిసభ్య కమిటీ

ప్రమాణస్వీకారం

తాళ్లరేవు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోరింగ సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా కొప్పిశెట్టి ఎస్ఎన్‌వీవీ ఈశ్వరరావు (బాబి), ఇద్దరు సభ్యులతో సీఈవో బోణం గౌరీశంకరరావు మంగళవారం ప్రమాణం చేయించారు. వారిని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అభినందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, సర్పంచ్ పెయ్యల మంగేష్, ఎంపీపీ రాయుడు సునీత, జడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్‌సాగర్, టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, గుత్తుల సాయి, మోపూరి రెడ్డినాయుడు, విల్లు ఆదినారాయణ, నాగిడి నాగేశ్వరరావు, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న లాజర్‌బాబు

'పవన్‌ను అప్రదిష్టపాల్జేసే కుట్రలు'

పిఠాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, జనసేన పార్టీని అప్రదిష్టపాలు చేసేందుకు వైసీపీ పథకం ప్రకారం కుట్రలు చేస్తోందని రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దానం లాజర్‌బాబు విమర్శించారు. పిఠాపురంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని కులాలను సమానంగా చూడడమే జనసేన లక్ష్యమన్నారు. పవన్‌కు పెరుగుతున్న ప్రజాదరణను ఓర్వలేక దళితులపై అక్కడక్కడా జరుగుతున్న సంఘటనలను పవన్, జనసేనలకు ఆపాదించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నాయకులు దాసరి దేవదాసు, వడ్డి రాజశేఖర్, బళ్ల వంశీ, మోర్త అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుద్ర నక్షత్ర పూజలు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 16 (ఆం ధ్రజ్యోతి): దుర్గాడ శివాలయంలో ఆరుద్ర నక్ష త్రం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. పంచాతయన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహా గణపతి పూజ, మహన్యాస పారాయణం, ఏకాదశ ద్రవ్య మహా రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి సప్తహారతులు ఇచ్చారు. సేవా సమితి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఐటీడీఏ పీవోను కలిసిన ఎమ్మెల్యే శిరీషదేవి


ఐటీడీఏ పీవోకు మొక్కను అందిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్‌రాజ్‌ను మంగళవారం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషదేవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీవోకు ఎమ్మెల్యే మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె నియోజకవర్గ సామాజిక, బౌగోళిక పరిస్థితులను ఐటీడీఏ పీవోకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందించే సంక్షేమ, అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న పలు దీర్ఘకాలిక సమస్యలు పీవోకు వివరించారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయ్ భాస్కర్ పీవోను కలిసిన వారిలో ఉన్నారు.

జడ్పీ పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో

అడ్డతీగల, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): అడ్డతీగలజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి (పాడేరు) పి.బ్రహ్మాజీరావు ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత విద్యార్థుల తరగతి గదులను పరిశీలించి ప్రగతిపై వారితో సంభాషించారు. అనంతరం విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. ఆన్‌లైన్ అటెండెన్స్ 100శాతం నమోదు చేయాలని సూచించారు. విద్యార్థుల నోటు పుస్తకాలు పరిశీలించి సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. పాఠశాల రికార్డులను టైంటేబుల్, ఎకడమిక్ క్యాలెండర్, ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్స్ టీచర్స్ డైరీ, తదితర రికార్డులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. పాఠశాల తరగతిగదులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యాశాఖ అధికారి పి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు బి.వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి


సోకిలేరువాగుపై గోదావరి ఎగపోటు వరద

చింతూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోదావరివరద ఉధృతి క్రమంగా తగ్గుతోంది. మంగళవారం రాత్రి ఏడు గంటలకు భద్రాచలంవద్ద గోదావరి 38 అడుగుల మేర ప్రవహిస్తోంది. సోమవారం రాత్రి ఎనిమిది గంటలకు భద్రాచలం వద్ద 38. 90 అడుగుల మేర ప్రవహించిన గోదావరి అనంతరం తగ్గడం మొదలైంది. చింతూరు వద్ద గోదావరి ఎగపోటు ప్రభావంతో చింతూరు వరరామచంద్రపురం మండలాల నడుమ సోకిలేరు వాగు వంతెన పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది.

● **నేడు గ్రీవెన్స్ రద్దు**

ప్రతి బుధవారం చింతూరు ఐటీడీఏలో నిర్వహించే గ్రీవెన్స్ రద్దు చేసినట్లు పీవో శుభం నోక్వాల్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వరదలు, వర్షాలు కారణంగా నేడు జరిగే గ్రీవెన్స్ రద్దు చేయనున్నట్లు పీవో ప్రకటించారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

మోతుగూడెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చింతూరు బొడ్డగండి గ్రామపంచాయతీ పరిధిలోగల గంగవాడ గ్రామంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం, రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ఎంపీటీసీ కరకా వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మంగళవారం నుంచి నెలరోజులపాటు పంచాయతీలోని ప్రతి గ్రామంలో సంబంధి శాఖ అధికారులు పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయకులు రామూర్తి, ప్రసాద్, ఉపసర్పంచ్ నాగ్ జయదాసు, వార్డ్ మెంబర్ నీలాపు సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

దేవీపట్నం(ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకొండ, మద్దిరాతిగూడెం తదితర గ్రామాల్లో పశువులు గాలికుంటు వ్యాధి, సీజనల్ తదితర వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పశుసంవర్ధక శాఖాధికారులు తమ సిబ్బందితో గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తున్నారు. పశువులు, మేకలు, గొర్రెలు ఉన్న రైతులు ఈ టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రామారావు, శంకరమ్మ ఉన్నారు.

ఆదికర్మయోగిపై సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆదికర్మయోగి అభియాన్ కార్యక్రమంపై మంగళవారం ఎంపీడీవో బాపన్నదొర పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గత 15 రోజులపాటు మండలంలోని 67 గ్రామాల్లో ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను గుర్తించామన్నారు. దీని ద్వారా ప్రభుత్వాలు ఏఏ పనులు చేపడతాయో వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీల భూముల్లో గిరిజనేతరుల సాగు అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న కుంజా శ్రీను

ఎటపాక, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల భూములను కౌలుకు తీసుకొని పలువురు గిరిజ నేతరులు జామాయిలు సాగు చేస్తున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను పేర్కొన్నారు. అటువ ంటి సాగును అరికట్టాలని శ్రీను డిమాండ్ చేశారు. మంగళవారం ఎటపాకలో నిర్వహించిన సంఘ సమావేశంలో శ్రీను మాట్లాడారు. ఎటపాక మండలం, నందిగా మకు చెందిన గిరి.నేతర రైతు గిరిజనుల భూముల్లో విచ్చల విడిగా జామాయిలు సాగు చేస్తున్నాడన్నారు. కౌలు కూడా సక్రమంగా చెల్లించకుండా గిరిజన రైతుల్ని మోసం చేస్తున్నాడని శ్రీను ఆరోపించారు. సీతాపురం సర్పంచ్ మోసం రాజులు, ఇర్ప రాజమ్మ, సోందె నాగేశ్వరరావు, ఇర్ప రమణ, సత్యమ్మ మంగమ్మ ప్రకటన పంపినవారిలో ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

అడ్డతీగల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):అడ్డతీగల మండలం వేటమామిడి హోసన్న హైస్కూల్ విద్యార్థులు జి.కాళిదాసు, రమేష్, సీహెచ్.విజయలు సోమవారం కాకినాడలో నిర్వహించిన జల్లాస్థాయి అండర్-17ఫుట్‌బాల్ పోటీలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హోసన్న హైస్కూల్ డైరెక్టర్ డేనియల్ సందీప్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల డీన్ ధనసందీప్ ప్రిన్సిపాల్ మృదుహసిని, పీఈటీ సుందర్ అభినందించారు.


రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం: యనమల


తొండంగి మండల నాయకులతో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తుని రూరల్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయకేతనం ఎగురవేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్ ఆధ్వర్యంలో తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం తొండంగి మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రామకృష్ణుడు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో అనుసరించాల్సిన ప్రణాళికలపై సూచనలిచ్చారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్న ప్రజలకు ఎమ్మెల్యే యనమల దివ్య పాలనపై సానుకూలత ఉందన్నారు. ఇప్పుడున్న ఓటు బ్యాంకును మరింత పదిల పరుచుకోవాల్సిన బాధ్యత గ్రామస్థాయి నాయకత్వంపై ఉందన్నారు. యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని, మహిళలకు 50శాతం రిజర్వేషన్లు ఉంటాయని, మహిళా అభ్యర్థుల ఎంపికపై కసరత్తుచేయాలని యనమల సూచించారు.

సాగరమాలతో అత్యాధునిక రోడ్లు

పారిశ్రామికంగా తొండంగి మండలం అభివృద్ధి సాధిస్తుందని యనమల పేర్కొన్నారు. భవిష్యత్‌లో కోన బంగారు కోనగా మారుతుందన్నారు. అన్నవరం నుంచి కాకినాడ పోర్టువరకు రూ.1200కోట్లతో కేంద్రప్రభుత్వం సాగరమాల పేరుతో అత్యాధునిక రోడ్లను ఏర్పాటు చేయబోతుందని, దీంతో పారిశ్రామికంగా కోనకు మంచి ఎదుగుదల ఉంటుందన్నారు. మండలాభివృద్ధికి నిధుల డోకా లేదని, ఇప్పటికే మంజూరైన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తొండంగి మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, జిల్లా మత్స్యకార సంఘంఅధ్యక్షుడు కోడ వెంకటరమణ, పంపా ప్రాజెక్టు చైర్మన్ పైరావర్షుల చందు, చొక్కా కాశి, యనమల లక్ష్మణరావు, నరాల శెట్టి సూర్యప్రకాష్, తాటిపర్తి శ్రీను, పక్కుర్తి నూకరాజు, కొయ్యా శ్రీను, కాలిబోయిన చంద్రరావు, కొయ్యా మల్లేష్, దూలం మురళీకృష్ణ, బంటుపల్లి అన్వేష్, కందా మురళి, నేమాల బాబురావు, అరిగెల నరసింహమూర్తి, సాధనాల నూకరాజు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను పరిరక్షిద్దాం

ఏలేశ్వరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొర పరిరక్షణ మనందరి బాధ్యతని ప్రిన్సిపాల్ సునీత అన్నారు. సోమవారం డిగ్రీ కళాశాలలో ఓజోన్ పొర పరిరక్షణ దినం సందర్భంగా విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. మొక్కలు నాటడం, సోలార్ విద్యుత్‌ను వినియోగించడం ఓజోన్ పొరను రక్షించడానికి దోహదపడతాయన్నారు. అధ్యాపకులు రాజేష్, వెంకటేశ్వరరావు, ప్రయాగమూర్తి, శివప్రసాద్, లక్ష్మి, బంగార్రాజు పాల్గొన్నారు.

జూడో పోటీల్లో ఏలేశ్వరం విద్యార్థినుల ప్రతిభ



ఏలేశ్వరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడలో నిర్వహించిన వివిధ క్రీడల్లో ఏలేశ్వరం విద్యార్థినులు ప్రతిభ చాటారు. గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బి.వరలక్ష్మి, 9వతరగతి చదువుతున్న మమత జూడో పోటీల్లో జూనియర్ విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ శారద తెలిపారు. వారితో పాటు వివిధ క్రీడల్లో 12మంది గోల్డ్ మెడల్స్ సాధించారని చెప్పారు.

జడ్పీటీసీ గాంధీకి పలువురి అభినందనలు

జగ్గంపేట, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో కిర్లంపూడి జడ్పీటీసీ తోట గాంధీ పుట్టినరోజు వేడుకలు జరిగాయి. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలుతెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీఎస్ అప్పలరాజు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, ఏలేరు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, ఆర్యవైశ్య రాష్ట్ర డైరెక్టర్ కొత్త కొండబాబు ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు.

కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మోహనరావుకు సత్కారం


మోహనరావును సత్కరిస్తున్న దృశ్యం

గండేపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావును గండేపల్లి ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెదపాటి శుభకర్ ఆధ్వర్యంలో సత్కరించారు. యర్రంపాలెం ఫిషర్‌మెన్ సొసైటీ ప్రెసిడెంట్ పాక నాగేశ్వరరావు, డైరెక్టర్లు మోహనరావును సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్లు పూలి వెంకన్న, కనికెళ్ల లక్ష్మణరావు, సైనం పొలు తదితరులు పాల్గొన్నారు.

‘ఆదిత్య’లో ముగిసిన టెక్‌ఫెస్ట్



గండేపల్లి,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి):సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో వేద 2కె25 జాతీయ స్థాయి టెక్‌ఫెస్ట్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం, నగదు బహుమతులు అందించారు. వైస్ చాన్సలర్ ఎంబి శ్రీనివాస్, డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డాక్టర్ రవి తంగజన్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, వేద 2కె25 కోఆర్డినేటర్ డాక్టర్ డి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగబాబు


నాగబాబును సత్కరిస్తున్న సంఘీయులు

కాకినాడ సిటీ, సెప్టెంబరు16(ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా నాయీ బ్రాహ్మణసేవా సంఘం ఎన్నికలు మంగళవారం వెంకట రత్నపురంలోని గాంధీభవన్‌లో ప్రశాంతంగా జరిగాయి. ఓట్ల లెక్కింపు అనంతరం జిల్లా అధ్యక్షుడిగా మెలిపాక నాగ సత్యనారాయణ (నాగబాబు) గెలుపొందినట్టు ఎన్నికల కమిటీ ప్రకటించింది. ఈ సందర్భంగా నాగబాబు మా ట్లాడుతూ జిల్లాలో అందరినీ కలుపుకుని నాయీ బ్రాహ్మణ కుల అభివృద్ధికి, సంఘ అభివృద్ధికి పాటుపడతానన్నారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు. కార్యక్రమంలో ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కాకినాడ సిటీ అధ్యక్షుడు వేపాడ శ్రీనివాసరావు, జిల్లా, పట్టణ, మండల నాయకులు స్వయంవరపు వీరభద్ర రావు, పొట్నూరి అప్పారావు, కొమ్మన అప్పన్న, తమిరి నాగేశ్వరరావు, మల్లువలస విష్ణుచక్రం, దోమాడ సూరిబాబు, అల్లవరపు శ్రీను, కోట ఉమాఅచ్యుత రమణ, గుణ్ణంపల్లి సత్యనా రాయణ పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న దృశ్యం

జగ్గంపేట, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించారు. జనసేన నాయకులు 500మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. మాదారపు వీరబాబు, కురుమల్ల నాగేశ్వరరావు, సత్తి సోమరాజు, గంధం శ్రీను, అంకం ఓం కృష్ణ, అడబాల వీరబాబు, రామకుర్తి శ్రీమన్నారాయ ణ, యర్రా సాయి డ్రిల్ మాస్టారు, గవర ఆనం దరావు, కోన బాబ్జి, గోకాడ తాతరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఏలేశ్వరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): లింగంపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2004-05 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు మంగళవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. పాఠశాలలో కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. గురువులకు పూలమాలలు వేసి సత్కరించారు.

హౌసింగ్ పీడీని కలిసిన గండేపల్లి అధికారులు



గండేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా హౌసింగ్ పీడీగా బాధ్యతలు చేపట్టిన నాతి బుజ్జిని గండేపల్లి మండల పరిషత్ ఏవో కె.చంద్రరావు, ఏపీవో కృష్ణంరాజు, ఈసీ రమేష్, టీఏలు మోహన్, శ్రీను, అబ్బులు, శ్రీను, దొర కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. నాతి బుజ్జి గతంలో గండేపల్లి ఎంపీడీవోగా పనిచేశారు.

మల్లేపల్లిలో అన్నదానం

గండేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మల్లేపల్లిలో జాతీయ రహదారి పక్కన వెలసిన అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం రామకుర్తి వెంకటరాజు తండ్రి, కొడుకుల జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. అక్కిరెడ్డి సత్తిబాబు, దార్లంక శ్రీను, జాజిమొగ్గల సత్యనారాయణ, పెమ్మనబోయిన జయ పాల్గొన్నారు.


గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న టీటీడీ పాలకవర్గం

గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే జ్యోతుల

జగ్గంపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ కలిశారు. గవర్నర్‌కు టీటీడీ పాలకమండలి చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ విజయదశమి సందర్భంగా తిరుమలలో జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు విచ్చేయాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు టీటీడీ బోర్డు మెంబర్లు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.


ద్వితీయస్థానం సాధించిన ప్రత్తిపాడు హైస్కూల్ విద్యార్థులు

వ్యాసరచన పోటీల్లో ద్వితీయస్థానం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వారధి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ద్వితీయస్థానం లభించింది. కాకినాడ గర్ల్స్ హైస్కూల్లో మంగళవారం బాలికల సంరక్షణ అంశంపై జిల్లాస్థాయిలో 20 మండలాల హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రత్తిపాడు హైస్కూల్ విద్యార్థులు సీహెచ్ శ్రవణ్‌కుమార్, టి.వర్షిణి వెంకట శివకుమారి, సీహెచ్ సరస్వతి ప్రతిభ కనబరచగా ద్వితీయస్థానం లభించిందని సీహెచ్ జాన్ ప్రసాద్ తెలిపారు. విజేతలను గైడ్ ఉపాధ్యాయులు సివానిత, వి.వెంకటరమణ, విద్యాకమిటీ చైర్మన్ ఎం.రాజేంద్రకుమార్, హెచ్‌ఎం జాన్‌ప్రసాద్ అభినందించారు.



జగ్గంపేటలో ఆందోళన చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు. పక్క చిత్రంలో శంఖవరంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

జగ్గంపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎలక్ట్రికల్ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం డివిజన్ జేఏసీ చైర్మన్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు ఆందోళన జరిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ దశల వారీగా విద్యుత్ ఉద్యోగులు ఆందోళనలు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట డివిజన్ జేఏసీ కన్వీనర్ ఎస్.నాయుడు, కో కన్వీనర్లు రాంబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

శంఖవరం, (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జగ్గంపేట డివిజన్ జేఏసీ కన్వీనర్ నాయుడు మాట్లాడుతూ గ్రేడ్ జేఎల్ఎం, కాంట్రా క్టర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. కాంట్రాక్టర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. మండల జేఈ భగతి కుమార్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన

తుని రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల సాగు లాభసాటి చేసుకోవాలని పెద్దాపురం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎస్.బుల్లిబాబు అన్నారు. వి.కొత్తూరులో రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన చిరుధాన్యాల పంట సాగులో మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజూ చిరుధాన్యాలు పండించాల్సిన సమయం ఆసన్నమైందని, దానికి అనుగుణంగా రైతులు చిరుధాన్యాల పంట సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సుర్ల లోవరాజు, తమరాన రామకృష్ణ, తమరాన సత్యనారాయణ, వ్యవసాయ శాఖాధికారి అశోక్‌కుమార్, ఏఈవో దైవప్రకాష్, జ్యోతి, అన్నపూర్ణ, శంకర్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రైతులనుద్దేశించి మాట్లాడుతున్న బుల్లిబాబు

మత్స్య సహకార సంఘం ఎన్నికల్లో బత్తుల ప్యానల్ విజయం

జగ్గంపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం రాజపూడి మత్స్య సహకార సంఘం నెంబర్ సి 218 నూతన పాలకవర్గ ఎన్నికలు జరిగాయి. బత్తుల వెంకటేశ్వర్లు ప్యానల్ విజయం 9 మంది సభ్యులను కార్యవర్గ సభ్యులుగా విజయం సాధించారు. ఈ సందర్భంగా జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను వారు కలిశారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, ఉప్పలపాటి బుల్లెబ్బు, రేఖ బుల్లి రాజు, ముమ్మన దుర్గ, గల్లా శ్రీను మంచాల హేమాద్రి ప్రసాద్, చందక వెంకటరమణ, కందుల సత్యనారాయణ, రేఖా కృష్ణ పాల్గొన్నారు.


సభ్యులను అభినందిస్తున్న జ్యోతుల నవీన్


ధర్మవరంలో రోడ్ల పక్కన ఉన్న పిచ్చిమొక్కలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ధర్మవరంలో పారిశుధ్య కార్యక్రమాలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం 4,5 వార్డుల్లో మంగళవారం పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించారు. సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి ఆధ్వర్యంలో సిబ్బంది రహదారుల వెంబడి పిచ్చిమొక్కలు తొలగించి, బ్లీచింగ్, క్లోరినేషన్ చేపట్టారు. వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు వ్యాపించకుండాముందస్తుగా ఈ పారిశుధ్య చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ సుశీల అబ్బాయి, కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాల్ తెలిపారు.

రాగుల సాగుపై అవగాహన సదస్సు

కోటనందూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాగుల సాగుపై పెద్దాపురం వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎస్.బుల్లిబాబు తాటిపాక, జగన్నాధపురంలో రైతులకు అవగాహన కల్పించారు. రాగులు సాగు చేసే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏఈవో జగ్గ అప్పారావు, శ్రీను పాల్గొన్నారు.



ఖాదీబోర్డు చైర్మన్ చౌదరిని సన్మానిస్తున్న కన్నబాబు

ఖాదీ బోర్డు చైర్మన్‌కు సన్మానం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఖాదీ గ్రామ పరిశ్రమల బోర్డు నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కేకే చౌదరిని ఖాదీ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు సన్మానించారు. మంగళగిరి ఖాదీ బోర్డు కార్యాలయానికి మంగళవారం అనుచరులతో కన్నబాబు వెళ్లి ఆయన్ను అభినందించడంతో పాటు ఖాదీ బోర్డు సీఈవోలను సన్మానించారు. చైర్మన్ చౌదరి ఖాదీ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన కన్నబాబును కూడా సన్మానించారు. కార్యక్రమంలో కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, టీడీపీ నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్, చలంకూరి మనోజ్‌కుమార్, మదినే స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్

గండేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్టు గండేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెవి నరేష్ తెలిపారు. ప్రత్యేకంగా స్త్రీల కోసం అన్ని గ్రామాల్లో 104 సంచార చికిత్స శిబిరాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా తల్లిబిడ్డల ఆరోగ్యం, టీకాల కార్యక్రమం, పోషణ్ అభియాన్, యువతుల ఆరోగ్యం, అంటువ్యాధుల నివారణ, క్యాన్సర్ వ్యాధులు, క్షయ నిర్ధారణ, మానసిక ఆరోగ్యం తదితర ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.